



# లక్ష్మీనృసింహుడి సేవలో ....





డక్కిలి, మార్చి 22: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు శుక్రవారం వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని పెంచలకోనలో వెలసిన లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకున్నారు. రాపూరు మండలం గోనుపల్లె వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు సాయంత్రం 3.30 గంటలకు హెలికాప్టర్‌లో చేరుకున్న చంద్రబాబు ఐదు నిమిషాల పాటు ప్రముఖులను పలకరించాక సంప్రదాయ దుస్తులతో కారులో బయల్దేరి 4 గంటలకు పెంచలకోనకు చేరుకొన్నారు. స్వామివారికి సమర్పించేందుకు పట్టువస్త్రాలు తీసుకుని గుడి చుట్టూ ప్రదక్షిణ చేసి ఆలయంలోకి ప్రవేశించారు.స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.చంద్రబాబు గోత్రనామాలతో అర్చకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆదిలక్ష్మీ దేవి, ఆంజనేయ స్వామి ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత గురించి చంద్రబాబుకు అర్చకులు వివరించారు.ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన పలువురు టీడీపీ నేతలు , శ్రేణులు చంద్రబాబుకోసం పెంచలకోనకు చేరుకున్నారు. మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పనబాక లక్ష్మీ, పరసా వెంకటరత్నం, ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, నెలవల సుబ్రమణ్యం, సుగుణమ్మ,హేమలత, వెంకటగిరి, సూళ్ళూరుపేట టీడీపీ అభ్యర్థులు లక్ష్మీసాయిప్రియ, నెలవల విజయశ్రీ, తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, వేనాటి సతీష్ రెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, కోటంరెడ్డి గిరిధర రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, తెలుగు యువత కార్యదర్శి కేవికే ప్రసాద్ నాయుడు, నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు. పప్పు చంద్రమౌళి రెడ్డి, బీరం రాజేశ్వరరావు, పునుగోటి విశ్వనాథ నాయుడు, ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, సోమయ్య, జర్నీ రమణయ్య, రుద్రకోటి సదాశివం, దందవోలు వెంకటేశ్వర్లు రెడ్డి, ఏదోటి కోటేశ్వర నాయుడు, కె.రాఘవరెడ్డి, ఖాజా, సీసీ నాయుడు, రావి సత్యం, మస్తాన్ నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు. 4.30 గంటల ప్రాంతంలో చంద్రబాబు తిరుగు పయనమయ్యారు.

## చిల్లకూరులో నారా భువనేశ్వరి

గూడూరు/చిల్లకూరు, మార్చి 22: నిజం గెలవాలి యాత్రలో భాగంగా శుక్రవారం సాయంత్రం గూడూరు నియోజకవర్గం తిప్పవరప్పాడు ప్రాంతానికి టీడీపీ అధినేత చంద్రబాబు భార్య నారా భువనేశ్వరి చేరుకున్నారు.కడప జిల్లా బద్వేలు నుంచి కారులో వచ్చిన ఆమెకు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌తో పాటు టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు స్వాగతం పలికారు.అక్కడినుంచి రాత్రి బస చేసేందుకు ఆమె చిల్లకూరులోని ఏ-5 హోటల్‌కు చేరుకున్నారు. శనివారం ఉదయం 9గంటలకు ఏ-5 హోటల్‌లో మహిళలతో భువనేశ్వరి ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొంటారు.తరువాత వాకాడు మండలం లోని తిరుమూరు గ్రామంలో చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతిచెందిన వెంకటస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేయనున్నారు. తరువాత సర్వేపల్లి నియోజకవర్గంలో జరగనున్న కార్యక్రమానికి వెళతారు.టీడీపీ నేతలు రవినాయుడు, శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



భువనేశ్వరికి తెలుగు మహిళల స్వాగతం

# చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా దగ్గుమళ్ల

● ప్రసాదరావు పేరు ప్రకటించిన టీడీపీ



చిత్తూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా మాజీ ఐఆర్‌ఎస్ అధికారి దగ్గుమళ్ల ప్రసాదరావును టీడీపీ అధిష్టానం ఖరారు చేసింది. బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గానికి చెందిన ఈయన కొన్నాళ్లుగా చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ప్రసాదరావును చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేయనున్నట్లు ఈనెల 7వ తేదీన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం విడుదల చేసిన అభ్యర్థుల మూడో జాబితాలో ఆయన పేరును టీడీపీ ప్రకటించింది. చిత్తూరు పార్లమెంటు పరిధిలో కుప్పం నియోజకవర్గం ఉండడం.. అక్కడ ప్రతిసారీ చంద్రబాబుకు అత్యధిక మెజార్టీ రావడం.. వంటి కారణాలతో ఇక్కడి నుంచి పోటీ టీడీపీ అభ్యర్థి కచ్చితంగా గెలుస్తూ వస్తున్నారు. 2019 ఎన్నికల్లో మాత్రం అప్పటి వేవ్ కారణంగా వైసీపీ అభ్యర్థి రెడ్డెప్ప చేతిలో శివప్రసాద్ ఓటమి చెందారు. ఆ తర్వాత అనారోగ్యంతో ఆయన మరణించారు. అప్పట్నుంచి చిత్తూరు ఎంపీ స్థానం ఎవరికి కేటాయిస్తారా అన్న ఆసక్తి శ్రేణుల్లో నెలకొంది. సినీ నటుడు సప్తగిరి ఎంపీ టికెట్ కోసం హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ద్వారా ప్రయత్నాలు చేసినట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత జీడీనెల్లూరు నియోజకవర్గానికి చెందిన మాజీ ఎస్పీ (కేంద్ర భద్రతా దళం) పీసీ స్వామి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరి ఎంపీ టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. చివరిగా మాజీ ఐఆర్‌ఎస్ అధికారి ప్రసాదరావు తెరపైకి వచ్చారు. ఈయన ఐఆర్‌ఎస్ అధికారిగా 2019లో ముందస్తు పదవీ విరమణ పొంది తన కుమారుడు రాధే పేరుతో హైదరాబాదులో కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ స్థాపించారు. ముందుగా బాపట్ల ఎంపీ స్థానం కోసం ప్రయత్నించిన ఆయన.. టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశంతో చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. పది రోజులుగా చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గవ్యాప్తంగా పర్యటించి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి ప్రచారాల్లో పాల్గొంటున్నారు.

**పూర్తి పేరు:** దగ్గుమళ్ల ప్రసాదరావు
**పుట్టినతేది:** 09.01.1962
**తల్లిదండ్రులు:** దివంగత సుశీలమ్మ, దివంగత లూకే
**కుమారుడు:** రాధే (ఎండీ, రాధే కన్‌స్ట్రక్షన్ కంపెనీ)
**సొంతూరు:** చింతగుంపల్లె గ్రామం, చిన్నగంజాం మండలం, బాపట్ల జిల్లా
**బ్యాచ్‌లర్ ఇన్ జర్నలిజం:** ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్
**పీజీ ఇన్ ఆర్ట్స్ అండ్ పొలిటికల్ సైన్స్:** సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాద్
**ఉద్యోగం:** ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖలో మాజీ జాయింట్ కమిషనర్ (ఐఆర్‌ఎస్ అధికారి). 2019లో ముందస్తు పదవీ విరమణ పొంది రాధే కన్‌స్ట్రక్షన్ కంపెనీ చైర్మన్‌గా ఉంటున్నారు.



వైసీపీ ప్రచారంలో టీటీడీ ఉద్యోగి నగేష్

# వేటు పడుతున్నా కోడ్‌ను ఖాతరు చేయరా?

● వైసీపీ ప్రచారంలో టీటీడీ ఉద్యోగి ● జనసేన అభ్యర్థిని కలసిన రుయా ఉద్యోగి
● 4రోజుల్లోనే ఆరుగురు వలంటీర్ల తొలగింపు ● శ్రీకాళహస్తి ఆర్టీసీ కండక్టర్‌పై విచారణ

తిరుపతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నియమావళిని కొందరు ఉద్యోగులు బేఖాతరు చేస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులను కలవడం, వారికి పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సన్మానించడం, మద్దతు తెలపడం, ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనడం వంటి తప్పిదాలకు పాల్పడుతున్నారు.తిరుపతి వైసీపీ అభ్యర్థి భూమన అభినయ్ రెడ్డి శుక్రవారం నాటి ఎన్నికల ప్రచారంలో పార్టీ నేతలతో పాటు టీటీడీ ప్రజా సంబంధాల విభాగం ఓఎస్డీ నాగేశ్వర రావు అలియాస్ నగేష్ పాల్గొన్నారు.టీటీడీలో విధులు నిర్వర్తిస్తూ ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా అధికార పార్టీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం తీవ్ర విమర్శలకు దారి తీసింది.తిరుపతి జనసేన పార్టీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును రుయాస్పత్రి నాన్ మెడికల్ విభాగం అడ్మిన్‌గా పనిచేస్తున్న టి.ఉమామహేశ్వర్ గురువారం రాత్రి ఒక హోటల్‌లో కలిశారు. రుయాలో పారిశుధ్యం, సెక్యూరిటీ, ఎస్‌ఏబీహెచ్ వంటి అంశాలను ఆయన పర్యవేక్షిస్తుంటారు. కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఆయన జనసేన పార్టీ అభ్యర్థిని కలవడంపై అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఎన్నికల నియమావళి నిబంధనలు ఉల్లంఘించిన కారణంగా ఇతడిపై అధికారులు చర్య తీసుకునే అవకాశముంది. ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యాక గత 18వ తేదీ నుంచీ ఇప్పటి దాకా నాలుగు రోజుల స్వల్ప వ్యవధిలోనే ఏర్పేడు, రేణిగుంట మండలాలకు చెందిన ఆరుగురు వలంటీర్లు ఉద్యోగం కోల్పోయారు. ఏర్పేడు మండలం మడిబాకలో సోమవారం వైసీపీ అభ్యర్థి బియ్యపు మధుసూదన రెడ్డి కుమార్తె పవిత్ర నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వలంటీరు మురళీ పాల్గొన్నారు. దీనిపై ఫిర్యాదులందడంతో మంగళవారం ఎంపీడీవో అతన్ని తొలగించారు.అదే మండలం రావిళ్ళవారి కండ్రిగలో గురువారం సాయంత్రం పవిత్ర నిర్వహించిన ప్రచారంలో వలంటీర్లు గీత, లత పవిత్ర పాల్గొనడం పట్ల ఫిర్యాదులు రావడంతో నిర్ధారించుకున్న ఎంపీడీవో శుక్రవారం వారిద్దరినీ తొలగించారు. ఈ మండలంలోనే ఆమందూరుకు చెందిన వలంటీరు చెంచు మణి, మేర్లపాక పంచాయతీ కొత్త కండ్రిగకు చెందిన వలంటీరు దర్శిక్ రెండు రోజుల కిందట తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరి చేరిక గురించి మీడియాలో రావడంతో పాటు వైసీపీ వర్గీయులు ఫిర్యాదు చేయగా ఎంపీడీవో శుక్రవారం ఇద్దరినీ తొలగించారు. దీంతో ఏర్పేడు మండలంలోనే నాలుగు రోజుల వ్యవధిలోనే ఐదుగురు వలంటీర్లు ఎన్నికల నియమావళి ఉల్లంఘించి విధుల నుంచీ తొలగించబడ్డారు. ఇక రేణిగుంట మండల కేంద్రంలోని నాల్గవ సచివాలయ పరిధికి చెందిన వలంటీరు మస్తాన్ గత బుధవారం పలువురు ముస్లిం మైనారిటీలను శ్రీకాళహస్తికి తీసుకెళ్ళి వైసీపీలో చేర్పించారు. ఈ విషయాన్ని వైసీపీ సోషల్ మీడియాలో షేర్ చేయడంతో టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీవో అదే రోజు అతన్ని విధుల నుంచీ తొలగించారు.ఏర్పేడు మండలం రావిళ్ళవారి కండ్రిగలో గురువారం పవిత్ర చేపట్టిన ఎన్నికల ప్రచారంలో శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ మురళీ పాల్గొన్నారు. దీనిపై ఫిర్యాదులు వెళ్లడంతో విచారణ జరిపి నివేదిక అందజేయాల్సిందిగా ఆర్డీవోను ఆర్టీసీ అధికారులు కోరారు. ఈలోపు అతనికి డ్యూటీలు కేటాయించకుండా ఖాళీగా వుంచారు. శనివారం ఆర్డీవో నుంచీ నివేదిక అందగానే కండక్టర్‌పై సస్పెన్షన్ వేటు పడే అవకాశముంది.



జనసేన అభ్యర్థి శ్రీనివాసులుతో రుయా ఉద్యోగి ఉమామహేశ్వర్

# కాలికి గాయమై వస్తే హెచ్‌ఐవీ వుందన్నారు!

● రుయాస్పత్రి ల్యాబ్ సిబ్బంది తప్పుడు రిపోర్టుతో వైద్యులు ఆపరేషన్ చేయలేమన్నారు
● కుంగిపోయానంటూ సూపరింటెండెంటుకు ఎర్రావారిపాళెం యువకుడి ఫిర్యాదు

తిరుపతి(వైద్యం), మార్చి 22 : రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రికి వస్తే చికిత్సలో భాగంగా చేసిన రక్త పరీక్షల్లో హెచ్‌ఐవీ పాజిటివ్ అని తప్పుడు రిపోర్టు ఇచ్చి చికిత్స చేయకుండా ఇబ్బందులకు గురి చేయడంపై బాధితుడు రుయాస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.బాధితుడి కథనం మేరకు ఎర్రావారిపాళెం మండలానికి చెందిన ఓ యువకుడు ఈ నెల 13న రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కాలికి తీవ్రగాయం కావడంతో కుటుంబ సభ్యులు రుయాస్పత్రిలో అడ్మిట్ చేయించారు. కాలికి సర్జరీ చేయాలన్న వైద్యులు రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అదే రోజు ఆస్పత్రిలోని ల్యాబ్‌లో రక్త నమూనాలు ఇవ్వడంతో సిబ్బంది పరీక్షలు నిర్వహించి మరుసటి రోజు రిపోర్టు ఇచ్చారు. అందులో హెచ్‌ఐవీ పాజిటివ్ అని ఉండడంతో ఆ యువకుడు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యాడు.అనుమానం వచ్చి అదేరోజు పక్కనే స్విమ్స్‌లో రక్త పరీక్షలు చేయించగా అక్కడ హెచ్‌ఐవీ నెగటివ్ వచ్చింది. ఆ రిపోర్టును తీసుకువచ్చి రుయాస్పత్రి వైద్యులకు చూపించి తనకు వెంటనే సర్జరీ చేయాలని కోరినా వారు పట్టించుకోలేదని బాధితుడు వాపోయారు. తిరిగి రుయాస్పత్రిలో ఈ నెల 20న రక్త పరీక్ష చేయించగా అందులో హెచ్‌ఐవీ నెగటివ్ వచ్చింది. మొదట ఇచ్చిన తప్పుడు రిపోర్టు వలన తన కుమారుడు మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమయ్యాడని, దీనికి తప్పుడు రిపోర్టు ఇచ్చిన రుయాస్పత్రి సిబ్బందే కారణమని బాధిత యువకుడి తండ్రి వాపోయాడు.దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ రవిప్రభును శుక్రవారం కోరారు.

## మద్యం తరలిస్తూ దొరికిపోయారు!

**ఇద్దరు సేల్స్‌మేన్, ఇద్దరు ట్రాన్స్‌పోర్టర్ల అరెస్టు**

తిరుపతి(నేరవిభాగం), మార్చి 22 : తిరుపతి రూరల్ మండలం తనపల్లిలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి మద్యం తరలిస్తున్న నలుగురిని శుక్రవారం సెబ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.40వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. సెబ్ రూరల్ సీఐ భీమలింగం సిబ్బందితో కలసి మద్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. తనపల్లి దుకాణంలో పనిచేస్తున్న బండి అబ్దుల్ రెహ్మాన్, ఎస్. రాజా శుక్రవారం 102 రాయల్ ప్యాలెస్ క్వార్టర్ బాటిళ్లను యుగంధర్, చెంజి సుబ్రహ్మణ్యం ద్వారా స్కూటీలో తిరుచానూరుకు తీసుకెళుతున్నారు. సెబ్ అధికారులు తనపల్లి ఐస్ ఫ్యాక్టరీ వద్ద వారిని పట్టుకుని మద్యం స్వాధీనం చేసుకున్నారు.

## 27న ప్రజాసంకల్పయాత్ర

● పలమనేరు నుంచి చంద్రబాబు ప్రారంభిస్తారన్న అమర్

పలమనేరు, మార్చి 22:టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాసంకల్పయాత్రను ఈనెల 27వ తేది పలమనేరు నుంచి ప్రారంభిస్తారని మాజీ మంత్రి అమరనాథరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పలమనేరు నియోజకవర్గం నుంచి ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని, అందులో స్థానిక, వ్యక్తిగత సమస్యలపై ప్రజలు లిఖితపూర్వకంగా తెలియజేసేందుకు వీలుంటుందన్నారు.టీడీపీ అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లో ఆ సమస్యలను పరిష్కరిస్తుందని అమరనాథరెడ్డి వివరించారు.

**రంజాన్ వేళలు**
ఇఫ్తార్ (శనివారం): సా. 6.27
సహరి (ఆదివారం) : ఉ. 4.55

## రెండు గంటలు ఆలస్యంగా ఏపీ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్

తిరుపతి సెంట్రల్ మార్చి22 : తిరుపతి-నిజాముద్దీన్ స్టేషన్ల మధ్య నడిచే ఏపీ సంపర్క్ క్రాంతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం ఉదయం రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. నిజాముద్దీన్ నుంచి తిరుపతికి చేరుకున్న ఈ ఎక్స్‌ప్రెస్‌కు మరమ్మతులు చేసే సమయంలో రెండు జనరల్ కోచ్‌లు రవాణాకు ఉపయోగపడవని కోచ్ అండ్ వ్యాగన్ శాఖ అధికారులు నిర్ధారించారు.ప్రత్యామ్నాయ బోగీలను సకాలంలో ఏర్పాటుచేయకపోవడంతో తిరుపతి నుంచి 21 పెట్టెలకు బదులు 19 పెట్టెలతోనే రైలు బయల్దేరింది. తద్వారా దాదాపు 200 మంది ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటలకు బయలుదేరాల్సిన ఈ ఎక్స్‌ప్రెస్ 7.45 గంటలకు బయలుదేరినట్లు అధికారులు తెలిపారు.



## తెప్పపై శ్రీభూ మలయప్ప కటాక్షం





తిరుమల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : తెప్పోత్సవాల్లో భాగంగా రెండురోజుల పాటు శ్రీరామ, శ్రీకృష్ణ రూపాల్లో దర్శనమిచ్చిన శ్రీవారు మూడో రోజైన శుక్రవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిగా తెప్పపై భక్తులను కటాక్షించారు.అంతకుముందు ఉత్సవమూర్తులను మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం పుష్కరిణిలో తెప్పపై కొలువుదీర్చారు. విద్యుద్దీపాల వెలుగులు, వేదం, నాదం, గోవిందనామస్మరణల మధ్య తెప్పపై శ్రీవారు విహరించారు. శనివారం ఐదుచుట్లు, ఆదివారం ఏడుచుట్లు పుష్కరిణిలో తెప్పపై మలయప్ప స్వామి విహరించనున్నారు.



## టీడీపీలో చేరిన వైసీపీ సానుభూతిపరులు

చంద్రగిరి, మార్చి 22: చంద్రగిరి మండలం గంగుడుపల్లెలో పలువురు వైసీపీ సానుభూతిపరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. శుక్రవారం పులివర్తి వినీల్ ఆధ్వర్యంలో గంగడుపల్లెలో మీఇంటికి మీపులివర్తి నాని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగడుపల్లె మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, ధర్మారెడ్డి, కామసాని గురవారెడ్డితోపాటు 15 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి పులివర్తి వినీల్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్, నాయకులు బండి వాసుదేవరెడ్డి, రూప కుమార్‌రెడ్డి, ఎస్వీ గంగిరెడ్డి, నరసింహారెడ్డి, చక్కర్‌రెడ్డి, పేస్‌రాయల్, బయారెడ్డి కుటుంబ సభ్యులు, ఈశ్వర్‌రెడ్డి, దేవరాజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీయూలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



సావనీర్ విడుదల చేస్తున్న దృశం

చంద్రగిరి, మార్చి 22: ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో అడ్వాన్సింగ్ టెక్నాలజీ ఇన్నోవేషన్స్ అండ్ సొల్యూషన్స్‌పై అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ సహకారంతో ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్ ఈ సదస్సును నిర్వహించింది. బిట్స్ పిలానీ గోవా క్యాంపస్ నుంచి డాక్టర్ దీపాంకర్ పాల్, ఎన్ఐటీ ట్రిచీ నుంచి డాక్టర్ శంకర నారాయణన్, గుర్గావ్‌లోని ఏయూపీటీసీ నుంచి గోపాల్ హల్దర్, ఎంబీయూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, వీసీ నాగరాజ్‌రామారావులు ఈ సదస్సులో పాల్గొని సావనీర్‌ను విడుదల చేశారు. మొదటి రోజు పవరింగ్ టూమారో, ఇన్నోవేషన్స్ ఇన్ ఎనర్జీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో చర్చ జరిగింది. కార్యక్రమంలో ఎంబీయూ రిజిస్ట్రార్ సారథి, డీన్‌లు శ్రీనివాసులు, ఈశ్వర్ సుంకర, బీఎం సతీష్, డిపార్ట్‌మెంట్ హెడ్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## నానీ గెలుపు కోసం పనిచేయండి



నాదెండ్ల మనోహర్‌తో జనసేన నాయకులు

చంద్రగిరి, మార్చి 22: చంద్రగిరిలో పులివర్తి నాని గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం తెనాలిలో చంద్రగిరి జనసేన నాయకులు ఆయనను కలిశారు.నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ దేవర మనోహర్ తనకు ఇష్టమైన వ్యక్తులనే కొత్త కమిటీల్లో నియమించుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన నాదెండ్ల మనోహర్ గతంలో నియమించిన వారికే కమిటీలలో చోటు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఉమ్మడి జిల్లా కార్యదర్శి నాసీర్, సంయుక్త కార్యదర్శి బీగాల అరుణ, ఆరు మండలాల జనసేన మండలాధ్యక్షులు వెంకట్ రాయల్, బొమ్మల కిషోర్, జస్వంత్, ముండ్లపూడి మురళి, రాంబాబు, కిరణ్‌కుమార్, నాయకులు శ్రీహరి, బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ రంగుల్లో ఆర్బీకే



తిరుపతి రూరల్, మార్చి22: మండల పరిధిలోని సి.గొల్లపల్లెలో ఉన్న రైతు భరోసా కేంద్రానికి (ఆర్బీకే) వైసీపీ రంగులు అలాగే దర్శనమిస్తున్నాయి. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి ఐదురోజులు గడిచినా అధికార పార్టీ రంగులను తొలగించడంలో అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వ్యక్తమ వుతున్నాయి.

## బ్రాహ్మణపట్టులో పశువైద్య శిబిరం

తిరుపతి రూరల్, మార్చి22: మండలంలోని బ్రాహ్మణపట్టు గ్రామంలో ఎస్వీ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకంలో భాగంగా శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహిం చారు. అనంతరం పంటల సాగు, తెగుళ్ల తదితరాలపై రైతులకు అవగాహన కల్పించారు. అధ్యా పకులు డాక్టర్ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ దేవకి, డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ శైలజ, డాక్టర్ అప్పలనాయుడు, ఎన్ఎస్ఎస్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలు స్వశక్తితో ముందుకు సాగాలి



రజితరెడ్డి

రామచంద్రాపురం, మార్చి 22: మహిళలు స్వశక్తితో ముందుకు సాగాలని మైథిలి లైఫ్‌సైన్స్ డైరెక్టర్ రజితరెడ్డి అన్నారు. వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ కాలేజీ అండ్ ఫార్మసీలో శుక్రవారం మహిళా సాధికారతపై సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ చేసే ప్రతిపనిలో విజయం సాధించాలంటే పట్టుదల, నిలకడ ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్‌బాబు, కరస్పాండెంట్ సుమలత, ప్రోగ్రాం సమన్వయకర్త డాక్టర్ లావణ్య వైదికర్, విద్యార్థినులు పాల్గొన్నారు.

## రాయలచెరువు సమస్యను పరిష్కరిస్తా: నాని



కాలేపల్లెలో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాని

రామచంద్రాపురం, మార్చి 22: తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే రాయలచెరువు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. మండలంలోని చిట్టత్తూరు, గొల్లపల్లె, కాలేపల్లి గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా రాయలచెరువు లోతట్టు ప్రాంతలు, దిగువ ఆయకట్టు రైతుల సమస్యను ఇరువర్గాలతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యం అయ్యేలా సమస్యను పరిష్కరిస్తామన్నారు. రాయలచెరువును పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేస్తామన్నారు. తిరుపతి నుంచి ఆర్‌సీపురం వరకు 150 అడుగుల రోడ్డుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అనుపల్లి వద్ద 150 ఎకరాల్లో కెమికల్ పరిశ్రమను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నారని దీనివల్ల తాగునీరు, సాగునీరు కలుషితమై ప్రజలు ఇబ్బందులు పడుతారని తెలియజేశారు. దీన్ని అడ్డుకుంటామన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకుఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకుడు జనార్ధన్ చౌదరి, హరిప్రసాద్, నరసింహారెడ్డి, మండలనాయకులు చిరంజీవిరెడ్డి, సురేంద్రనాయుడు, దినేష్ నాయుడు, మహేష్, కోటేశ్వరరెడ్డి, గిరినాయుడు, గిరిధర్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు జనార్ధన్, జనసేన అధ్యక్షుడు హరి పాల్గొన్నారు.

## వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి



చంద్రగిరి, మార్చి 22: మండలంలోని నాగయ్యగారి పల్లె వద్ద ఓ వృద్ధురాలిని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఆమె మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు ... రొంపిచెర్ల మండలం బోయపాటివారిపల్లెకు చెందిన సాలమ్మ(63) గురువారం రాత్రి 7 గంటల సమయంలో ఆటో దిగి రోడ్డు దాటుతుండగా ఓ ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాలమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతురాలు భర్త గురుస్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# రుయాస్పత్రిలో ఏజెన్సీ మాయాజాలం

- పారిశుధ్య ఏజెన్సీ నియామకంలో కాలయాపన
- వేరొక పేరుతో పాత వారికే కట్టబెట్టే యత్నం



పారిశుధ్య నిర్వహణకు టెండరు దాఖలు చేస్తున్న అభ్యర్థి

తిరుపతి(వైద్యం), మార్చి 22 : నిబంధనలు పాటించకుండా అవకతవకలకు పాల్పడుతున్న ఏ-1 పారిశుధ్య ఏజెన్సీని తక్షణమే రద్దు చేసి వారి స్థానంలో మరొకరిని నియమించాలని ఐదు నెలల కిందట డీఎంఈ, కలెక్టర్ ఆదేశించారు. వాటిని ఏ మాత్రం పట్టించుకోకుండా ఐదు నెలలుగా అధికారులు కాలయాపన చేస్తున్నారు. దీని వెనుక పెద్ద మాయాజాలమే జరుగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. రుయా, ఎస్వీ వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలకు సంబంధించి పారిశుధ్య పనులను ఏ-1 ఏజన్సీ చూస్తోంది. వారు నిబంధనలు ఏమాత్రమూ పాటించకపోగా 205 మంది కార్మికులకు గాను కేవలం వంద మందితో పనిచేయిస్తుండటం, తక్కువ వేతనాలు చెల్లించడం వంటి ఫిర్యాదులు రావడంతో కొత్త వారిని నియమించాలని గత ఏడాది అక్టోబరులో డీఎంఈ నరసింహం రుయా అధికారులను ఆదేశించారు. కానీ కలెక్టర్ అందుబాటులో లేరని, డీఎంఈ నుంచి రిటర్న్‌గా ఆదేశాలు రాలేదని రుయా అధికారులు కాలయాపన చేస్తూ వస్తున్నారు. ఏజన్సీ నిర్వహణకు మే 31వ తేదీ వరకే గడువు ఉండటం, ఆపై మరో రెండేళ్లు పొడిగించే అవకాశం ఉండటంతో ప్రస్తుత ఏజన్సీ నిర్వాహకులు అధికార పార్టీకి చెందిన కొందరు ముఖ్యనేతల నుంచి రుయా అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం. కలెక్టర్ ఈ విషయాన్ని తెలుసుకుని తక్షణమే రీటెండరు నిర్వహించాలని ఆదేశించడంతో శుక్రవారం రీటెండరు ప్రక్రియ మొదలుపెట్టారు. నాలుగు టెండర్లు వచ్చినట్లు రుయా అధికారులు తెలిపారు. కాగా, ప్రస్తుత ఏజన్సీ నిర్వాహకులు అందులోనూ బినామీ పేర్లతో టెండర్లు వేసినట్లు సమాచారం. మరి అధికారులు దీనిపై ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది.

## రహదారి పనుల పేరుతో
# రెండేళ్లుగా మట్టి దోచేస్తున్నారు

- వైసీపీ నేతలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు





మట్టి తరలిస్తున్న వాహనం - గుట్టను లోడుతున్న పొక్లయినర్, పక్కనే ఆగి ఉన్న టిప్పర్

రేణిగుంట, మార్చి 21: రేణిగుంట మండలంలో వైసీపీ నాయకుల కన్నుసన్నల్లో మట్టి అక్రమ రవాణా యధేచ్ఛగా కొనసాగుతోంది. నేషనల్ హైవే పనుల పేరుతో రెండేళ్లుగా అడ్డూఅదుపు లేకుండా దోచేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... రేణిగుంట మండల పరిధిలో నేషనల్ హైవే పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణానికి గతంలో అప్పటి కలెక్టర్ మల్లిమడుగు గుట్టకింద మట్టి తీసుకునేందుకు అనుమతులు ఇచ్చారు. దీని అదునుగా చేసుకున్న వైసీపీ నాయకులు రెండేళ్లుగా రాత్రింబవళ్లు మట్టిని రవాణా చేస్తూ దోచుకుంటున్నారు.ఎక్కడ మట్టి అవసరమైనా రేణిగుంట వైసీపీ నాయకులను సంప్రదిస్తే ఆగమేఘాలపై సరఫరా చేస్తున్నారు. నేషనల్ హైవేకి మట్టిని తరలించే తెల్ల టిప్పర్ లారీని పోలిన నెంబరుప్లేటు లేని లారీల్లో ఎవరికీ అనుమానం రాకుండా మట్టిని తరలిస్తున్నారు.చుట్టుపక్కల మండలాల్లో జరిగిన ప్రైవేటు వెంచర్ల నుంచి రైల్వే కాంట్రాక్టు పనుల వరకూ ఇక్కడి మట్టినే భారీ మొత్తంలో తరలించారు.ఈ విషయమై ఫిర్యాదులందడంతో గతంలో మైనింగ్ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి అక్కడ ఉన్న లారీలను అడ్డుకుని టైర్లకు గాలి పీకేసి రేణిగుంట సీఐ సుబ్బారెడ్డికి ఫిర్యాదు చేశారు.తర్వాత ఏమైందో ఏమో కానీ అధికారులు ఆ పక్క తొంగి చూడలేదు.

## వేము కళాశాలలో 'ప్రజ్ఞ' ప్రారంభం





విద్యార్థులు రూపొందించిన టెక్నాలజీ బుక్‌ను ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్ నాయుడు

పూతలపట్టు, మార్చి 22: వేము ఇంజనీరింగ్ కళాశాల ఆవరణంలో ప్రజ్ఞ-2కే24 కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులు టెక్నాలజీలోనూ ముందుండాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడంలో ప్రజ్ఞ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి 50 టీములు పాల్గొన్నాయన్నారు. విద్యార్థులు రూపొందించే టెక్నాలజీ సమాజానికి ఉపయోగపడేవిధంగా ఉండాలన్నారు. సైంటిస్ట్ భవానీకుమార్ మాట్లాడుతూ.. ఈ కళాశాల త్వరలోనే యూనివర్సిటీగా మారడం ఖాయమన్నారు. డాక్టర్ మల్లికార్జున్, నవీన్ కిల్లారి, డాక్టర్ ప్రకాష్, లెక్చరర్లు, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, సాయంత్రం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## క్యూలైన్‌లో ఫ్యాన్లు, కూలర్ల ఏర్పాటు



తిరుచానూరు, మార్చి 22: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయ క్యూలైన్లలో ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో మధ్యాహ్నం వీఐపీ బ్రేక్ సమయంలో, సాయంత్రం నైవేద్యం సమయంలో భక్తులు పెద్దసంఖ్యలో బారులు తీరుతారు. వేసవికావడంతో ఎండ వేడిమి, ఉక్కపోతతో ఇబ్బంది పడేవారు. ఈ క్రమంలో దాతల సాయంతో క్యూలైన్‌లో ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు చల్లటివాతావరణంలో అమ్మవారిని దర్శనం చేసుకుంటున్నారు. కాగా దర్శనం తర్వాత వెలుపలకు రాగానే ఎండ వేడిమికి భక్తుల కాళ్లు బొబ్బలు ఎక్కుతున్నాయి. ఆలయం వెలుపల మహద్వారం వద్ద ప్రతి సంవత్సరంలాగే రేకుల షెడ్డును ఏర్పాటుచేయాలని భక్తులు కోరుతున్నారు.

## చెవిరెడ్డి అన్యాయాలకు పాల్పడుతున్నారు



సుధారెడ్డి

తిరుచానూరు, మార్చి 22: చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వ్యవస్థలను గుప్పెట్లో ఉంచుకుని కొందరి సహకారంతో అన్యాయాలకు పాల్పడుతున్నారని తెలుగు మహిళా నేత పులివర్తి సుధారెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా చంద్రగిరి నియోజకవర్గంలో ఓట్ల నమోదు కోసం 1,44,000 బోగస్ దరఖాస్తులు దాఖలయ్యాయన్నారు. ఫాం-6 ద్వారా 60వేల దరఖాస్తులు రాగా అందులో అధికారికంగా 30వేలను అనుమతించినట్లు తెలిపారు. ఫాం 8 ద్వారా 11వేల దరఖాస్తులు రాగా వాటిని చేర్చారన్నారు. మళ్లీ దొంగ, బోగస్ ఓట్లు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. అధికారులు దొంగ ఓట్లను అరిక ట్టాలన్నారు.

# ప్చ్... ఈసారీ అంతేనా!

- మామిడిలో కనిపించని పూత
- దిగుబడిపై రైతుల ఆందోళన



పలమనేరు, మార్చి 22: జిల్లాలో ఈసారి కూడా మామిడిలో సాధారణ దిగుబడి కూడా వచ్చే సూచనలు కనిపించడం లేదు. మామూలుగా అయితే, ఇప్పటికే మామిడి తోటలు పూతతో కళకళలాడుతుండాలి. కానీ, ఇందుకు భిన్నంగా లేత ఆకులతోను, పచ్చదనంతో ఉండి పూత నామమాత్రంగా కనిపిస్తోంది. ఉద్యానవన లెక్కల మేరకు ఈ ఏడాది పంట దిగుబడి గణనీయంగా తగ్గుతుందని అంచనా. వాతావరణంలో వచ్చిన పెనుమార్పులే దీనికి కారణమని అంటున్నారు. గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో అధికారులు మామిడి రైతులకు సమావేశాలు నిర్వహించి పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అయితే పూతే నామమాత్రంగా కనిపిస్తుండటంతో మామిడి రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా మామిడి సాగు చేయాలంటే ఎకరాకు కనీసం రూ.2.5 లక్షల ఖర్చు అవుతోంది. ఇక ఉన్న మామిడి తోటల నిర్వహణకు కూడా ఎకరాకు కనీసం రూ.లక్ష వ్యయమవుతోందని రైతులు అంటున్నారు. మామిడి తోటల మధ్యఉన్న భూమిని చెత్తా చెదారం లేకుండా ఏపుగా దున్నించడం, కొమ్మలు కత్తిరించడం, కనీసం మూడు పర్యాయాలు రసాయన మందుల పిచికారి చేయించాల్సి ఉంటుందని చెబుతున్నారు. కూలీల కొరత.. ఇవన్నీ పెట్టుబడిపై ప్రభావం చూపుతున్నాయని రైతులు అంటున్నారు.

### సగమైనా దిగుబడి వస్తుందా?

జిల్లాలో 54,732 హెక్టార్లలో మామిడి తోటలు సాగుచేస్తున్నారు. ఇందులో గరిష్ఠంగా బంగారుపాళ్యం మండలంలో 6091 హెక్టార్లలో.. కనిష్ఠంగా గుడుపల్లె మండలంలో 33 హెక్టార్లలో మామిడి సాగవుతోంది. సాధారణ దిగుబడి వస్తే హెక్టారుకు 10 టన్నులు ఉండాలి. వాతావరణ మార్పులు కారణంగా పూత అంతంత మాత్రం రావడంతో హెక్టారుకు 4నుంచి 6 టన్నుల మేరకైనా దిగుబడి వస్తుందా అని రైతులు ఎదురు చూస్తున్నారు.

### ఊజీల బెడద

కూలీలు, పంట దిగుబడులు తగ్గిపోవడంతో పాటు కొన్నేళ్లుగా మామిడి కాయలకు ఊజీ ఈగలు గుడ్లు పెడుతున్నాయి. ఇవి మామిడి కాయలు బాగా పక్వం దశలో వుండగా పెట్టే గుడ్లు మామిడి కాయలు మాగే దశలో కాయ మొత్తం పురుగులు దర్శనమిస్తున్నాయి. దీంతో ఊజీ ఈగల పట్ల మామిడి రైతులు అధికారుల సూచనలు పాటించడం లేదని తెలుస్తోంది. సస్యరక్షణతో పాటు క్రిమి కీటకాలు, ఊజీల నివారణకు అధికారులు సూచనలు పాటించాల్సిన అవసరం వుంది.

### బీమా ఏదీ?


తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఒక్కో మామిడి చెట్టుకు రూ.40 నుంచి 50 వరకు బీమా చేయించుకొని పంట నష్టం జరిగితే పరిహారం అందేది. దీని వల్ల ఎంతో కొంత ఊరట కలిగేదని రైతులు అంటున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ క్రాప్ ద్వారా మామిడి పంటను నమోదు చేస్తున్నప్పటికీ బీమా వర్తింప జేయడం లేదని రైతులు చెబుతున్నారు.

### సిండికేట్లను అరికట్టాలి

జిల్లాలో పండే మామిడి పంట లో దాదాపు 70 శాతానికిపైగా ఇక్కడి పల్ప్ ఫ్యాక్టరీలు కొంటున్నాయి. అయితే మామిడికి డిమాండు ఉన్నప్పటికీ ఈ ఫ్యాక్టరీల సిండికేట్ కారణంగా తక్కువ ధరలే ఇస్తున్నారని రైతులు అంటున్నారు. ప్రభుత్వం సిండికేట్లను అరికడితే తమ కు గిట్టుబాటు ధర వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

### ఎగుమతులకు కొరగాని దిగుబడులు

వాస్తవానికి మామిడి ఎగుబడులకు తగిన విధంగా రైతులు పండించడం లేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. పంటల దిగుబడి, సస్యరక్షణల కోసం రైతులు విపరీతంగా వినియోగించే రసాయన అవశేషాలు మామిడిలో వున్నందును విదేశాలకు ఎగుమతి చేసే అవకాశాలు లేకుండా పోతోందని చెబుతున్నారు. తగిన సూచనలు తీసుకొని పాటిస్తే అధిక లాభాలు వచ్చే అవకాశం లేకపోలేదని అధికారులు చెబుతున్నారు.



## 26న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాక

### ఎస్వీయూలో లా విద్యార్థులనుద్దేశించి ప్రసంగం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 22 : ఈనెల 26 వ తేదీన ఎస్వీ యూనివర్సిటీకి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ ధనుంజయ వై.చంద్రచూడ్ రానున్నారు. యూనివర్సిటీలోని లా విభాగం పరిధిలో బీఏ ఎల్ఎల్‌బీ ఇంటిగ్రేటెడ్ కోర్సు ఏర్పాటు చేసి పదేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించనున్న (న్యాయోత్సవ్-2కె24) వర్క్‌షాప్‌కు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ లీగల్ ఎడ్యుకేషన్' అంశంపై చేపట్టే రెండు రోజుల వర్క్‌షాప్‌ను ప్రారంభించనున్నారు. అనంతరం యూనివర్సిటీ పరిధిలోని లా కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులనుద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమానికి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షత వహించనున్నారు.

## హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత



తిరుపతి(నేర విభాగం), మార్చి 22 : తిరుపతి అలిపిరి పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో జనవరి 7న మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కొండూరు చలపతి కుటుంబానికి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ చేయూతనందించారు. అడిషనల్ కార్పస్ ఫండ్‌కు సంబంధించి రూ.లక్ష చెక్కును ఆయన భార్య నళినికి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్రావు పాల్గొన్నారు.

## రేపు శ్రీవేంకటేశ్వర చిత్రార్చన

తిరుపతి (కల్చరల్), మార్చి 22: టీటీడీకి చెందిన శ్రీవేంకటేశ్వర శిల్ప కళాశాలలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి శ్రీవేంకటేశ్వర చిత్రార్చన నిర్వహించనున్నట్లు శ్రీకళాక్షేత్ర ఒక ప్రకటనలో తెలిపింది. ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటుడు, పద్మశ్రీ బ్రహ్మనందం హాజరవుతారని పేర్కొంది. విశిష్ఠ అతిథులుగా టీటీడీ విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం.భాస్కరరెడ్డి, ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు కిరణ్ క్రాంత్ చౌదరి, ప్రముఖ కథా రచయిత ఆర్ఎం.ఉమామహేశ్వరరావు, ప్రముఖ కవి డాక్టర్ కలువగుంట రామమూర్తి, మీడియా ప్రముఖులు ఎ.శ్రీధర్ పాల్గొంటారని తెలిపింది.

## దివ్యాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీ



తిరుపతి(కొర్లగుంట), మార్చి 22: హోప్ ఫర్ స్పందన, సిర్ఫ్ సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం జీపాళెం వద్దనున్న శ్రీలక్ష్మీనరసింహ దివ్యాంగుల సేవా కేంద్రానికి నిత్యావసర సరుకులు వితరణ చేశారు. రూ.50వేలు విలువచేసే బియ్యం, కంది, ఉద్ది, పెసరపప్పు, చక్కెర, చెల్లం, రాగి, గోధుమ పిండి వంటి 30రకాల వంట సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిర్ఫ్ సంస్థ కార్యదర్శి మరుపూరి శేఖర్, కోఆర్డినేటర్ మధురిమ, తేజోవతి, మునిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృత వర్సిటీలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్

తిరుపతి(రూరల్), మార్చి 22: జాతీయ సంస్కృతవర్సిటీలో మోడల్ కెరీర్‌సెంటర్ ఆధ్వర్యంలో అరుణాచల్ ప్రదేశ్‌లోని వివేకానంద కేంద్ర పాఠశాలలో సంస్కృత అధ్యాపకుల నియామకాల కోసం శుక్రవారం రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఎనిమిది అధ్యాపక పోస్టులకు 50 మందికిపైగా విద్యార్థులు హాజరైనట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్‌జె రమాశ్రీ పేర్కొన్నారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, మోడల్ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ జేబీ చక్రవర్తి, వివేకానంద కేంద్ర పాఠశాల ప్రిన్సిపాల్ కె.జయసర్కార్, హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి అనిమేశ్, మారుతి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి టికెట్ స్థానికులకు దక్కేలా చూడుతల్లీ

### వేయికళ్ల దుత్తలతో తెలుగు మహిళల మొక్కులు



తిరుపతి, మార్చి22(ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి టికెట్ స్థానికులకు దక్కేలా చూడుతల్లీ అంటూ తెలుగు మహిళలు వేడుకున్నారు. శుక్రవారం స్థానిక తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో వేయికళ్ల దుత్తలతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నగర మహిళా అధ్యక్షురాలు బ్యాంకు శాంతమ్మ, మహిళా నాయకురాళ్లు అనిత, హేమావతి, రేవతి, సుజాతమ్మ, యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జలం లేకుంటే జీవనం లేదు



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రామచంద్రాపురం, మార్చి 22: జలం లేకుంటే ప్రాణికోటికి జీవనమే లేదని సెవెన్ హిల్స్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్‌బాబు తెలియజేశారు. వెంకటరామాపురం సెవెన్ హిల్స్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం నీటి వినియోగం, ప్రాముఖ్యతపై విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. భూగర్భ జలాలు అడుగంటి పోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో గ్రామ స్తులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సుమలత, డాక్టర్ అరుణకుమారి, దొమ్మరాజు పాల్గొన్నారు.

## తిరుచ్చిపై పద్మావతిదేవి సాక్షాత్కారం



తిరుచానూరు, మార్చి 22: తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారు బంగారు తిరుచ్చిపై కొలువుదీరి శుక్రవారం ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు సాక్షాత్కరించారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ మధు, శ్రీవాణి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గణేష్, సుభాస్కర్‌నాయుడు, అశోక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి

## వాహనాలు, ర్యాలీకి అనుమతులు తప్పనిసరి


వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 22: సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారం కోసం వినియోగించే వాహనాలు, ర్యాలీలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సూచించారు. విజయవాడ నుంచి ఆయన వర్చువల్ విధానంలో జిల్లా అధికారులతో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ లక్ష్మీశ హాజరయ్యారు. ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వివిధ ఓటరు ఫారాలు, క్లెయిమ్స్, అబ్జెక్షన్స్‌ను నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ర్యాలీలు, ప్రచారం కోసం వాడే వాహనాల కోసం సంబంధిత రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అందిన విజ్ఞప్తి మేరకు అనుమతులు ఇవ్వాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ఉండాలని, శాంతిభద్రతల పర్యవేక్షణ, సీజర్ ఆఫ్ క్యాష్, లిక్కర్, డ్రగ్స్ తదితరాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నూతన ఓటర్ల నమోదుకు ఫారం-6 అందజేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచలకిషోర్, నోడల్ అధికారులు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఎన్నికల డీటీ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

## నిర్భయంగా ఓటువేసేలా చర్యలు


డీఐజీ అమ్మిరెడ్డి

తిరుమల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడూ నిర్భయంగా ఓటు వేయడానికి పోలీసు శాఖ తగిన చర్యలు తీసుకుందని డీఐజీ అమ్మిరెడ్డి తెలిపారు. శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. సమస్యాత్మక గ్రామాలను పరిశీలించి, శాంతి భద్రతల సమస్యలు లేకుండా చూస్తున్నామన్నారు. సమస్యాత్మక వ్యక్తులను బైండోవర్ చేస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ తుపాకులను డిపాజిట్ చేయిస్తున్నామన్నారు. సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, మద్యం, నగదు రాకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు.

## ఆదిమూలం వద్దు..హెలెన్ ముద్దు

● టీడీపీ నాగలాపురం మండల నాయకుల డిమాండ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 22: సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదిమూలం వద్దని, డాక్టర్ హెలెన్‌ను అభ్యర్థిగా ప్రకటించాలని ఆ పార్టీకి చెందిన నాగలాపురం మండల నాయకులు కోరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్ లో శుక్రవారం వారు మాట్లాడుతూ ఆదిమూలం వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులను అన్ని విధాలా వేధించారని, కేసులు పెట్టారని గుర్తుచేశారు. ఇప్పటికీ పలువురు నాయకులు, కార్యకర్తలు పోలీసుస్టేషన్, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నందుకు తమపైనా కేసులు బనాయించారని తెలిపారు. పార్టీ అధిష్ఠానం పునరాలోచించుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాగలాపురం మండల క్లస్టర్ ఇన్‌చార్జి ఎండీ కుమార్, కోదండం తిరుపతి, నాగరాజు, మహేష్, బాబు, శివ, దేవ, మునివేలు, అన్నాదొరై, సామ్రాజ్యం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్లు, పోలింగ్‌స్టేషన్ల వివరాలు తెలపండి


మాజీ ఎమ్మెల్యే మోహన్‌ను కలసిన ఆరణి

తిరుపతి అర్బన్ 22 : జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు శుక్రవారం ఉదయం నగర కమిషనర్ అదితిసింగ్‌ను కలిశారు. ఓటర్లకు ఇబ్బంది లేకుండా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని, నియోజకవర్గ పరిధిలో ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల సంఖ్య తదితర వివరాలు అందించాలని ఆరణి కోరారు. జనసేన నేత డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఆయన వెంట ఉన్నారు. అలాగే బీజేపీ సీనియర్ నాయకులు పొనగంటి భాస్కర్‌ను కలసి ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించాలని అభ్యర్థించారు. అదే విధంగా బీజేపీ అలిపిరి మండల ప్రెసిడెంట్ జనార్దన్‌రెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ దామురాయల్, మాజీ ఎమ్మెల్యే మోహన్‌ను ఆయన నివాసంలో కలసి మద్దతు కోరారు.

## కేజ్రీవాల్ అరెస్టు దేశ చరిత్రలో చీకటి అధ్యాయం

● ఆమ్ ఆద్మీ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి సుబ్రమణ్యం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 22: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు దేశ చరిత్రలో చీకటి అధ్యాయంగా నిలిచిపోతుందని ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి సుబ్రమణ్యం పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆమ్‌ఆద్మీ పార్టీని రాజకీయంగా ఎదుర్కోలేక బీజేపీ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిందని ఆరోపించారు. పదేళ్లలో జాతీయ పార్టీగా అవతరించిన ఆమ్‌ఆద్మీని అణిచివేయడం ప్రధాని తరం కాదని స్పష్టం చేశారు. ఈ అరెస్టును దేశ ప్రజలు ఖండించాలని, రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్ నేత రాంభూపాల్‌రెడ్డి, సీపీఎం నేత నాగరాజు, సీపీఐ నేత మురళి, ఆమ్‌ఆద్మీ నాయకులు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటాచలపతి, రాష్ట్ర అధికార ప్రతినిధి చందు, సీవైఎస్ రాష్ట్ర కన్వీనర్ జగదీష్, తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేష్ రాయల్ పాల్గొన్నారు.

## కోడ్ ఉల్లంఘించిన రుయా ఉద్యోగి


ఆరణి శ్రీనివాసులుతో కరచాలనం చేస్తున్న ఉమామహేశ్వరావు

తిరుపతి(వైద్యం), మార్చి 22: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఇతర ఉద్యోగులు రాజకీయ నేతలను కలవడం, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం చేయకూడదు. అయితే రుయాస్పత్రిలో అడ్మిన్‌గా పనిచేస్తున్న ఉమామహేశ్వరావు ఆస్పత్రిలో పనిచేసే కొందరు ప్రైవేటు వ్యక్తులతో కలిసి గురువారం రాత్రి నగరంలోని ప్రైవేటు హోటల్లో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును కలవడం చర్చనీయాంశమైంది. ఆయన్ను సన్మానించడంతోపాటు గంటకు పైగా రాజకీయాలకు సంబంధించి చర్చలు జరిపి, ఫొటోలు దిగి ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారు.

## వైసీపీ ప్రచారం షురూ



తిరుపతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ తిరుపతి అభ్యర్థి భూమన అభినయ రెడ్డి శుక్రవారం ప్రచారం ప్రారంభించారు. టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీషతో కలసి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి, 10, 11 డివిజన్లలో ప్రచారం చేపట్టారు. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పలువురు టీటీడీ, మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు గంగమ్మ ఆలయం వద్దకు వచ్చి అభినయ్‌కు అభినందనలు తెలిపారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.10 కోట్లు

తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.10 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 60,485 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,851 మంది తలనీలాలు సమర్పించారు.

## వెంకన్న సేవలో ప్రముఖులు


వెంగ్‌సర్కార్

తిరుమల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్, తెలంగాణ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ క్రికెటర్ దిలీప్ వెంగ్‌సర్కార్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. వెంగ్‌సర్కార్ మీడియాతో మాట్లాడుతూ టీ20 వరల్డ్‌కప్‌లో భారత్ విజయం సాధిస్తుందన్నారు.

## పదో తరగతి పరీక్షలకు 541 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మార్చి 22: జిల్లాలో శుక్రవారం జరిగిన పదో తరగతి పరీక్షలకు 541 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. గణిత పరీక్షకు 27,182 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 26,641 మంది హాజరయ్యారు. 98 శాతం మంది విద్యార్థులు పరీక్ష రాశారని, జిల్లాలో ఎక్కడా మాస్ కాపీయింగ్ జరుగలేదని డీఈవో డాక్టర్ శేఖర్ తెలిపారు.

## సీ-విజిల్‌కు ఫిర్యాదు చేయండి

తిరుపతి, మార్చి22(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై సీ-విజిల్ యాప్‌కు ఫిర్యాదు చేయాలని తిరుపతి నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసే అంశాల్లో డబ్బు, లిక్కర్ పంపిణీ, బెదిరింపులు, ఉచిత బహుమతుల పంపిణీ, ఆయుధాల ప్రదర్శన, ఫేక్ న్యూస్ అంశాలపై ఫొటోలు, వీడియోలు, వాయిస్ మెసేజ్ పంపించడం చేయవచ్చునని పేర్కొన్నారు. కంట్రోల్ రూములోని 0877-2256766 నెంబరుకు కాల్ చేసి ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.

## వీటికి కోడ్ వర్తించదా..?


వైసీపీ రంగులతో కూడిన దిశ పోలీసుల జీపు


వైసీపీ రంగులతో ప్రజా మరుగుదొడ్లు


ద్విచక్ర వాహనం


ఎస్వీ వైద్య కళాశాల ముఖ ద్వారం, నూతన పీజీ వైద్య విద్యార్థుల భవనం ముందు శిలాఫలకాలు

తిరుపతి(కపిలతీర్థం), మార్చి 22 : ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి వారమవుతున్నా ఇంకా పూర్తి స్థాయిలో పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసుల వాహనాలకే వైసీపీ రంగులు తొలగలేదంటే కోడ్ ఏ రీతిలో అమలవుతుందో అర్థం చేసుకోవచ్చు. నగరపాలక సంస్థలోనూ ఇదే పరిస్థితి ఉంది. ప్రజా మరుగుదొడ్లకు వైసీపీ రంగులు కనిపిస్తున్నాయి. ఎస్వీ వైద్య కళాశాల ప్రధాన ముఖద్వారం ముందే నేతల పేర్లు కలిగిన శిలాఫలకాలు కనిపిస్తున్నాయి. పీజీ బాలుర వైద్య విద్యార్థుల భవనం ముందు ఏర్పాటు చేసిన శిలాఫలకంలోనూ పేర్లు కనిపిస్తున్నాయి.

## ఓటింగ్‌పై అవగాహన పెంచుకోవాలి


తిరుపతిలో సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

తిరుపతి (నేరవిభాగం), మార్చి 22: ఓటు హక్కుపై అవగాహన పెంచుకుని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం రేంజ్ డిఐజీ అమ్మిరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని అమెరికన్ బార్ నుంచి జీవకోన, గ్యాస్ గోడౌన్, అంబేడ్కర్ సర్కిల్, సత్యనారాయణపురం, తిరుమల బైపాస్ రోడ్డు, లీలామహల్ సర్కిల్ వరకు బీఎస్ఎఫ్ దళాలు కవాతు నిర్వహించాయి. ఓటును అమ్ముకోవద్దు, నోటుకోసం ఆశపడవద్దు అంటూ నినాదాలు చేశారు. ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో సీఐ జయనాయక్ నేతృత్వంలో ముత్యాలరెడ్డిపల్లి, అన్నమయ్య సర్కిల్, రాయలచెరువు రోడ్డు మీదుగా అమరావతి నగర్ వరకు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, డీఎస్పీ సురేంద్ర రెడ్డి, సీఐ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## అంకుర సంస్థల ఏర్పాటుపై దృష్టి సారించండి



తిరుపతి(రూరల్), మార్చి22: వ్యవసాయ కోర్సులు చదివే విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా అంకుర సంస్థల ఏర్పాటుపై దృష్టి సారించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సి.రమణ పేర్కొన్నారు. ఆర్ఏఆర్ఎస్‌లో ఆర్కేవీవై రాఫ్తార్‌పథకం ద్వారా నిర్వహించే ఆంగ్రు అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్ ఆధ్వర్యంలో శుక్రవారం అగ్రివిజన్1.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఏడీఆర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారం చూపే విధంగా ఆవిష్కరణలు రూపొందించి, తద్వారా కొత్త సంస్థల ఏర్పాటుకు ముందుకురావాలని తెలిపారు. కాగా అగ్రి బిజినెస్ కేంద్రం ద్వారా శిక్షణ పూర్తిచేసి, ఆర్థిక సహకారం అందుకున్న మొదటి, రెండవ బ్యాచ్‌లకు చెందిన అంకుర సంస్థలకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి.బాలహుస్సేన్‌రెడ్డి, డాక్టర్ పీవీ సత్యగోపాల్, డాక్టర్ ఆర్.కల్పనాశాస్త్రి, ఎం.శ్రీనివాసరెడ్డి, సి.సునీల్ పాల్గొన్నారు.

## కేజ్రీవాల్ అరెస్టు సరికాదు : చింతా

తిరుపతి(కపిలతీర్థం), మార్చి 22 : ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం సరికాదని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇండియా కూటమిని ఎదుర్కొనే శక్తి లేక బీజేపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించారు. ఎంతో మంది ముఖ్యమంత్రులపై అవినీతి ఆరోపణలు ఉన్నా కేజ్రీవాల్‌ను మాత్రమే అరెస్టు చేయడంలో ఆంతర్యమేమిటో చెప్పాలని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా వెళుతున్న బీజేపీకి ప్రజా కోర్టులో పరాజయం తప్పదన్నారు.

# గంగమ్మగుడిలో కుంకుమార్చన




తిరుపతి (కల్చరల్), మార్చి 22: తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శుక్రవారం ఉదయం లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఉదయం 6 గంటలకు గణపతి హోమం జరిగింది. 8.30 గంటల నుంచి అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజ చేశారు. అమ్మవారికి, ఉత్సవ మూర్తికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజలో పాల్గొన్నవారికి తీర్థప్రసాదాలు, పసుపు, కుంకుమ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు గోపియాదవ్, ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.మమత, సభ్యులు వెంకటేశ్వరరావు, ధనశేఖర్, హరినాథ్‌రెడ్డి, రమణమ్మ, గీత, భారతి, కృష్ణమ్మ పాల్గొన్నారు.

## ఎవరా వ్యక్తి?

● ముక్కంటి సాంస్కృతిక కార్యక్రమాల అవినీతిపై దేవాదాయశాఖ ఆరా

తిరుపతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తీశ్వర స్వామి శివరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో దేవాదాయ శాఖ అధికారులు ఆరా తీశారు. ముక్కంటి సాంస్కృతిక శాఖ ఉత్సవాల్లో కళాకారుల ఇబ్బందులు, ఆకట్టుకోలేని కార్యక్రమాల నిర్వహణ, అవినీతి ఆరోపణలపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాల నేపథ్యంలో జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ (ఏసీ) రామకృష్ణారెడ్డి స్పందించారు. ఆలయ ఉద్యోగికాని విశ్రాంత ఉపాధ్యాయుడు స్వర్ణమూర్తికి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ అప్పగించినట్లు గుర్తించారు. దీని వెనుక ఉన్న రాజకీయ ఒత్తిడులపై ఆరా తీశారు. పలువురు కళాకారులతో కూడా మాట్లాడినట్టు తెలిసింది. భవిష్యత్తులో అలాంటి వ్యక్తులను దూరం పెట్టాలని ముక్కంటి ఆలయ అధికారులకు ఏసీ సూచనలు చేసినట్టు సమాచారం. దీనిపై ముక్కంటి ఆలయ ఈవో నాగేశ్వరరావు కూడా ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం.

## అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

తిరుమల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు శుక్రవారం రూ.10లక్షలు విరాళంగా అందింది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, తిరుపతికి చెందిన ప్రొఫెసర్ నారాయణరావు ఈ విరాళాన్ని అందజేశారు. తిరుమలలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డికి ఈ విరాళాన్ని దాత అందజేశారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించండి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 22: జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను రెండు రోజులకొకసారి సందర్శించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం జిల్లాలోని ఎన్నికల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఎన్నికల శిక్షణకు హాజరు కాని పీవో, ఏపీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సి-విజిల్ యాప్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. నియోజకవర్గాల్లోనూ సి-విజిల్ మానటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. నాయకులకు సువిధ యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల కోడ్‌కు ముందు మంజూరై ప్రారంభమైన పనుల వివరాలను అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఆర్వోలు జేసీ ధ్యానచంద్ర, అదితిసింగ్, డీఆర్వో పెంచలకిషోర్, నిశాంత్‌రెడ్డి, కిరణ్‌కుమార్, చంద్రముని, రామమోహన్ పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 13మందికి జరిమానా

తిరుపతి(లీగల్), మార్చి 22 : అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన 13 మందికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. వీరిని తిరుపతి ట్రాఫిక్ కానిస్టేబుల్ గిరిబాబు కోర్టులో హాజరుపరిచారు.

# దుర్గంధభరితంగా చేపల మార్కెట్ సర్కిల్

తిరుపతి, లీలామహల్ సర్కిల్, మార్చి 22 : నగరంలోని చేపల మార్కెట్ సర్కిల్ దుర్గంధభరితంగా మారింది. ఆ చుట్టుపక్కల ప్రాంతాలకు వెళితే భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్న నాయకులకు, అధికారులకు ఇది కనిపించలేదా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. నెల రోజుల క్రితం టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీషా, డిప్యూటీ మేయర్లు వచ్చి మధురానగర్ రోడ్డును ప్రారంభించారు. ఆ సమయంలో కూడా పట్టించుకోకుండా వెళ్లిపోయారు. వినాయకస్వామి ఆలయం ముందు పారిశుధ్యం పూర్తిగా లోపించింది. ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశామని, స్పందన కార్యక్రమంలో సైతం వినతులు సమర్పించామని ఆ ప్రాంతానికి చెందిన లక్ష్మి, గీత తెలిపారు.



చేపల మార్కెట్ రోడ్డుపై ప్రవహిస్తున్న మురికినీరు - వినాయక స్వామి ఆలయం ముందు పారిశుధ్య లోపం

రహదారి పనుల పేరుతో

# రెండేళ్లుగా మట్టి దోచేస్తున్నారు..

● వైసీపీ నేతలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



గుట్టను లోడుతున్న పొక్లయినర్ (ఇన్‌సెట్లో) మట్టి తరలిస్తున్న వాహనం

రేణిగుంట, మార్చి 21: రేణిగుంట మండలంలో వైసీపీ నాయకుల కన్నుసన్నల్లో మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. నేషనల్ హైవే పనుల పేరుతో రెండేళ్లుగా అడ్డూఅదుపు లేకుండా దోచేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... రేణిగుంట మండల పరిధిలో నేషనల్ హైవే పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణానికి గతంలో అప్పటి కలెక్టర్ మల్లిమడుగు గుట్టకింద మట్టి తీసుకునేందుకు అనుమతులు ఇచ్చారు. దీని అదునుగా చేసుకున్న వైసీపీ నాయకులు రెండేళ్లుగా రాత్రింబవళ్లు మట్టిని రవాణా చేస్తూ దోచుకుంటున్నారు. ఎక్కడ మట్టి అవసరమైనా రేణిగుంట వైసీపీ నాయకులను సంప్రదిస్తే ఆగమేఘాలపై సరఫరా చేస్తున్నారు. నేషనల్ హైవేకి మట్టిని తరలించే తెల్ల టిప్పర్ లారీని పోలిన నెంబరు ప్లేటు లేని లారీల్లో ఎవరికీ అనుమానం రాకుండా మట్టిని తరలిస్తున్నారు. చుట్టుపక్కల మండలాల్లో జరిగిన ప్రైవేటు వెంచర్ల నుంచి రైల్వే కాంట్రాక్టు పనుల వరకూ ఇక్కడి మట్టినే భారీగా తరలించారు. ఈ విషయమై ఫిర్యాదులం దడంతో గతంలో మైనింగ్ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి అక్కడ ఉన్న లారీలను అడ్డుకుని టైర్లకు గాలి పీకేసి రేణిగుంట సీఐ సుబ్బారెడ్డికి ఫిర్యాదు చేశారు. తర్వాత ఏమైందో కానీ అధికారులు ఆ పక్క తొంగి చూడలేదు.

## చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

### 66 గ్రాముల బంగారు, 250 గ్రాముల వెండి రికవరీ

నాయుడుపేట టౌన్, మార్చి 22: వివిధ చోరీ కేసుల్లో నిందితుడిని అరెస్టు చేసి, బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు నాయుడుపేట అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన సోమశేఖర్ నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు, పట్టణాల్లో చోరీలకు పాల్పడ్డాడు. శుక్రవారం నాయుడుపేట - మల్లాం జంక్షన్ కూడలి వద్ద అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 66 గ్రాముల బంగారు, 250 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపీ పాల్గొన్నారు.

# పుత్తూరు వార్తలు

## ప్రభుత్వ భూమి చదును చేస్తున్నా పట్టించుకోరా?



ప్రభుత్వ భూమి చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

వడమాలపేట, మార్చి 22: మండలంలోని సీతారామపురం సమీపంలో పశువైద్యశాల వద్ద ప్రభుత్వ స్థలాన్ని కొందరు చదును చేస్తున్నారు. శుక్రవారం ఉదయం ఎక్స్‌కవేటర్ల సాయంతో తవ్వి ట్రాక్టర్లతో మట్టి తరలించి చదును చేస్తున్నారు. గతంలోనూ ఆక్రమణ జరిగితే రెవెన్యూ అధికారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు వివాదంలో ఉన్నా మళ్లీ ఆక్రమణకు పాల్పడడం దారుణమని, ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్ల నెంబర్ల ఫొటోలతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి యంత్రాలను స్వాధీనం చేసుకుని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## వేడుకగా పద్మావతీదేవి ఊంజలసేవ



నారాయణవనం, మార్చి 22: మండల కేంద్రంలోని పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పంగోణోత్తర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నాల్గవ రోజు అమ్మవారిన ఊంజలసేవ వేడుకగా నిర్వహించారు. ఉదయం నిత్య కైంకర్యాల అనంతరం అమ్మవారిని ప్రత్యేక తిరుమంజనం జరిపారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవర్లను అలంకరించి తిరుచ్చి వాహనంపై ఆలయ అంతర ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య అమ్మవారిని ఊంజల మండపంలో ఊయలపై కొలువదీర్చి, ఊయలసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## మినీ ట్రాన్స్‌పోర్టు యూనియన్ కార్యవర్గం ఎంపిక



పొన్నురంగం, హరీష్‌కుమార్

పుత్తూరు అర్బన్, మార్చి 22: మినీ ట్రాన్స్‌పోర్టు యూనియన్ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కే.పొన్నురంగం, ఉపాధ్యక్షుడిగా ఏ.హరీష్‌కుమార్, కార్యదర్శిగా కే.మురగారెడ్డి, సహాయ కార్యదర్శిగా టీ.రఘు, కోశాధికారిగా ఏ.ధనపాల్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా పి.తిరుమల, ఏ.నేతాజీ, బి.సురేష్, ఎస్.జమీర్, సి.ఉమాపతి, ఎం.వెంకటయ్య, ఎం.కుమార్ బాబు, పి.మూర్తివేలు, టీకే.విక్రమ్, ఎస్.పళణి ఎంపికయ్యారు.

## జాబ్‌మేళాలో 247 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

పుత్తూరు టౌన్, మార్చి 22: స్థానిక గోవిందపాలెంలోని శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. 532 మంది పాల్గొనగా వివిధ దశల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి 247 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఏపీ ప్రోగ్రాం మేనేజర్ సిహెచ్ మోహన్, చిత్తూరు జిల్లా ప్లేస్మెంట్ అధికారి వెంకటప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఉమామహేశ్వర్, ప్రిన్సిపాల్ మాణిక్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

## పోస్టర్ల ఆవిష్కరణ

వడమాలపేట, మార్చి 22: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి ఉత్సవాల పోస్టర్లను ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్ఐ ధర్మారెడ్డి ఆవిష్కరించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జయంత్, ఉపాధ్యక్షుడు గురవయ్య, ప్రభాకర్, నాయకులు గణేష్, వెంకటేష్, వెంకటస్వామి, సుబ్రహ్మణ్యం, వెంకయ్య, నాగేంద్ర, అంజనేయులు పాల్గొన్నారు.

# సూళ్లూరుపేట/వెంకటగిరి

## గురుకులాల్లో ప్రవేశానికి 31లోగా దరఖాస్తు చేసుకోండి

వెంకటగిరి టౌన్, మార్చి 22: గురుకుల పాఠశాలల్లో 5,6,7,8 తరగతులు, జూనియర్, డిగ్రీ కళశాల ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు మార్చి 31 తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏపీఆర్ఎస్ కన్వీనర్ మల్లంపాటి రజని, ప్రిన్సిపాల్ శారదాబాయి చౌదరి శుక్రవారం కోరారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25 నిర్వహిస్తామని చెప్పారు. గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత వసతితో పాటు సీఎంఏ, సీఏ, నీట్, ఐఐటీ పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

## కాలగందలో పోషణ పక్వాడ

బాలాయపల్లి, మార్చి 22: చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల పోషకాహార లోపాన్ని నివారించడంతో పాటు మాతా శిశు మరణాలను అరికట్టవచ్చని అంగన్వాడీ పర్యవేక్షకురాలు రాజేశ్వరి అన్నారు. శుక్రవారం మండలంలోని కాలగంద గ్రామంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సూళ్లూరుపేటలో రసవత్తర పోరు

● ప్రచారంలో దూసుకుపోతున్న టీడీపీ

● హ్యాట్రిక్ కోసం కిలివేటి పోరాటం



తడ, మార్చి 22: సూళ్లూరుపేట నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల హడావుడి మొదలైపోయింది. ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. టీడీపీ అభ్యర్థిగా నెలవల విజయశ్రీని ఆ పార్టీ ఎంపిక చేసింది. అధికార వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు మరోమారు అవకాశం ఇస్తూ పోటీలో నిలిపింది. 2014, 19 ఎన్నికల్లో విజయం సాధించిన కిలివేటి సంజీవయ్య ఈ సారి కూడా గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని ఉవ్విళ్లూరుతున్నారు. తన కుటుంబానికి 20 యేళ్ల తరువాత వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కుమార్తెను అసెంబ్లీకి పంపాలన్న పట్టుదలతో నెలవల సుబ్రహ్మణం ఉన్నారు. టీడీపీ అభ్యర్థి విజయశ్రీ రాజకీయాలకు పూర్తిగా కొత్త అయినా ఆమె తండ్రి నెలవల సుబ్రహ్మణ్యం సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి 2004లో ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తరువాత జరిగిన మూడు ఎన్నికల్లో ఆయనకు టిక్కెట్ దక్కకపోవడంతో పోటీకి దూరమయ్యారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా టీడీపీ అధిష్ఠానం ఆయన కుమార్తె విజయశ్రీకి టికెట్ కేటాయించింది. అభ్యర్థి కుమార్తె అయినా గెలుపు బాధ్యత నెలవల సుబ్రహ్మణ్యం తన భుజాల మీద వేసుకుని ప్రచారం సాగిస్తున్నారు. ఆయనకు ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ అండదండలు అందిస్తూ మార్గదర్శకం చేస్తుండటంతో ప్రచారంలో దూసుకుపోతున్నారు. మరో వైపు వైసీపీ నుంచి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ముచ్చటగా 3వ సారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని పట్టుదలగా ఉన్నారు. ఆర్థికంగా కొంత బలవంతుడైన సంజీవయ్యకు పార్టీ అండగా ఉన్నా, అసమ్మతి రాగం వినిపిస్తున్న నాయకుల సంఖ్య ఎక్కువగానే ఉంది. వారిని బుజ్జగించేందుకు కిలివేటి మల్లగుల్లాలు పడుతున్నారు. అలాగే టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీకి సైతం మొదట్లో అసమ్మతి బెడద ఉన్నా... వారందరినీ సముదాయించడంలో కొండేపాటి గంగాప్రసాద్ సఫలమయ్యారు. సూళ్లూరుపేట నియోజకవర్గానికి పెద్ద దిక్కుగా ఓ వెలుగు వెలిగిన వేనాటి రామచంద్రారెడ్డి కొద్దిరోజుల క్రితం టీడీపీకి రాజీనామా చేసినా ఆయన అనుచరులు పూర్తిగా పార్టీలోనే ఉండిపోయారు. ఇక వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో రాజీనామా చేసి టీడీపీలో చేరుతుండటంతో ఆ పార్టీ హుషారు కనిపిస్తోంది. అంతేకాకుండా వైసీపీలోని కొందరు నాయకులు తెరచాటుగా నెలవలకు సహకారం అందించేందుకు సిద్ధపడుతున్నట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి.

## టీడీపీలోకి యువత



పార్టీలో చేరిన రోసనూరు పంచాయతీ యువకులతో టీడీపీ నేతలు

పెళ్లకూరు, మార్చి 22: మండలంలోని రోసనూరు, రోసనూరు రాజుపాలెం, కొత్తూరు గ్రామాలకు చెందిన యువకులు టీడీపీలో చేరారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నేతలు ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్థానిక నేత దొమ్మరాజు సత్యంరాజు సమక్షంలో యువకులు పార్టీలో చేరడంతో వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు పేరం రమేష్‌నాయుడు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారనే నమ్మకంతోనే విద్యావంతులు, యువకులతో పాటు పలు పార్టీలకు చెందిన నేతలు టీడీపీలో చేరుతునట్లు తెలిపారు. పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ నెలవల విజయశ్రీ ఆమె విజయానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వట్టికుండల శేఖర్‌నాయుడు, పేరం మధుసూదన్ నాయుడు, దామెర ప్రసాద్‌నాయుడు, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, కేవీనాయుడు, సుధాకర్‌రెడ్డి, రామకృష్ణా, మునీష్, వెంపళ్ల వెంకటేశ్వర్లు, మల్లిఖార్జునరెడ్డి, రంగనాధ నాయుడు, మారాబత్తిన గురవయ్య, నెలవల ప్రసాద్‌యాదవ్, జడపల్లి వెంకటేశ్వర్లు, బడికాల శ్రీనివాస్, వేలూరు రమణయ్య, దామతోటి సుబ్రహ్మణ్యం, ఆరూరు సుబ్రహ్మణ్యం, రాహూరు పరుశురాం, ఉల్లిపాయల శ్రీనివాస్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్ల ప్రారంభం



ఆర్‌వో ప్లాంటును ప్రారంభిస్తున్న జైసింగ్

వెంకటగిరిటౌన్, మార్చి 22: వెంకటగిరిలోని బంగారుపేట ప్రాథమిక పాఠశాల, ఏపీటీడబ్ల్యూఆర్ పాఠశాల, ఆర్ఎస్ కండ్రిగ పాఠశాలల్లో శ్రీనివాసన్ సేవా ట్రస్టు(టీవీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లను ట్రస్టు క్లస్టర్ ఇన్‌చార్జి జైసింగ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవ ట్రస్టు లక్ష్యమని అన్నారు. ఇప్పటికే మండలంలో ఐదు ఆర్వో ప్లాంట్లను ప్రారంభించామని, త్వరలో మరో మూడింటిని ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే వెనకబడిన ప్రాంతాల వారికి ఆర్థిక తోడ్పాటు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## నీటిని పొదుపుగా వినియోగించండి




ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గూడూరు, మార్చి 22: నీటిని పొదుపుగా వినియోగించాలని స్వర్ణాంధ్రభారతి పాఠశాల కరస్పాండెంట్ నవకోటి నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక రెండో పట్టణ పరిధిలోని కోర్టు సెంటర్ నుంచి గాంధీనగర్ వరకు స్వర్ణాంధ్రభారతి పాఠశాల ఆధ్వర్యంలో ప్రపంచ నీటి పొదుపు దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని జీవరాసి మనుగడకు నీరు ఎంతో అవసరమన్నారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. నీరు లేకపోతే జీవం ఉండదన్నారు. కార్యక్రమంలో సునీల్‌రాజ్, హరికృష్ణ, సింధూ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటికి తప్పని తిప్పలు

గూడూరు అర్బన్, మార్చి 22: పట్టణంలో గత ఐదు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణానికి కండలేరు జలాశయం నుంచి నీటిని అందించే పైపులైన్లు మరమ్మతుల కారణంగా ఐదు రోజులుగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మున్సిపల్ అధికారులు ట్యాంకర్ల ద్వారా పలు వీధులకు నీటిని సరఫరా చేస్తున్నా, అవి చాలక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు ముందస్తుగా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేసుకుని పైపులైన్ల మరమ్మతుల సమయంలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ట్యాంకరు ద్వారా మంచినీరు సరఫరా



ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న స్థానికులు

గూడూరు, మార్చి 22: స్థానిక 4వ వార్డులోని నరసయ్యగుంట ప్రాంతానికి టీడీపీ నాయకుడు చంద్రమౌళి ట్యాంకర్ ద్వారా మంచినీటిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజులుగా పట్టణంలో పైపులైన్ల మరమ్మతుల కారణంగా తాగునీటికి సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సూచనల మేరకు తన సొంత నిధులను వెచ్చించి ట్యాంకర్ ద్వారా ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

## అంకుర సంస్థల ఏర్పాటుపై దృష్టి సారించండి

తిరుపతి(రూరల్), మార్చి 22: వ్యవసాయ కోర్సులు చదివే విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా అంకుర సంస్థల ఏర్పాటుపై దృష్టి సారించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సి.రమణ పేర్కొన్నారు. ఆర్ఏఆర్ఎస్‌లో ఆర్‌కేవీవై రాఫ్తార్ పథకం ద్వారా నిర్వహించే అంగ్రు అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్ ఆధ్వర్యంలో శుక్రవారం అగ్రివిజన్ 1.0 కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఏడీఆర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారం చూపే విధంగా ఆవిష్కరణలు రూపొందించి, తద్వారా కొత్త సంస్థల ఏర్పాటుకు ముందుకురావాలని తెలిపారు. కాగా, అగ్రి బిజినెస్ కేంద్రం ద్వారా శిక్షణ పూర్తిచేసి, ఆర్థిక సహకారం అందుకున్న మొదటి, రెండవ బ్యాచ్‌లకు చెందిన అంకుర సంస్థలకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి.బాలహుస్సేన్‌రెడ్డి, డాక్టర్ పీవీ సత్యగోపాల్, డాక్టర్ ఆర్.కల్పనాశాస్త్రి, ఎం.శ్రీనివాసరెడ్డి, సి.సునీల్ పాల్గొన్నారు.

## మేరిగ విజయానికి కృషి

కోట, మార్చి 22: కోటలోని ఏఎన్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం వైసీపీ మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా వచ్చిన వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకుడు, వైసీపీ సీఈసీ సభ్యుడు కొడవలూరు ధనంజయరెడ్డి మాట్లాడుతూ అందరూ కలసికట్టుగా పనిచేసి మేరిగ మురళీధర్‌ను గెలిపించాలని కోరారు. ఇదిలా ఉండగా మండలంలోని రెండు గ్రామాలకు చెందిన వలంటీర్లు సమావేశానికి వచ్చారు. మీడియా ఫొటోలు తీసేందుకు ప్రయత్నించడంతో సమావేశం నుంచి వెళ్లిపోయారు. సమావేశంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, సంపత్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేతల సంబరాలు

కోట, మార్చి 22: నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేరును అధిష్ఠానం ఖరారు చేయడంతో కోట మండల పరిధిలోని విద్యానగర్ గాంధీబొమ్మ సెంటర్ శుక్రవారం ఆ పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. తిరుపతి పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి వాకా విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు బాణాసంచా పేల్చి హర్షం వ్యక్తం చేశారు.

## వైసీపీ నేతల ప్రచారం

గూడూరు అర్బన్, మార్చి 22: పట్టణంలోని 1,2వ వార్డుల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ కుమారులు రేవంత్ చక్రవర్తి, హేమంత్ కల్యాణ్ శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తమ తండ్రి మురళీధర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బొమిడి శ్రీనివాసులు, సతీష్‌రెడ్డి, తాళ్లూరు శ్రీనివాసులు, గురవయ్య, సునీల్‌రెడ్డి, గోవర్ధన్, అశోక్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ఎంఈవో తనిఖీలు



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈవో

కోట, మార్చి 22: మండల పరిధిలోని కేశవరం పంచాయతీ సిద్ధమ్మకండ్రిగ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈవో మస్తానయ్య తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. విద్యాబోధనపై హెచ్‌ఎంకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. భోజనంలో నాణ్యత లోపించకుండా చూడాలని నిర్వాహకులను ఎంఈవో ఆదేశించారు.

## కేజ్రీవాల్ అరెస్టు దేశ చరిత్రలో చీకటి అధ్యాయం

### ఆమ్‌ఆద్మీ పార్టీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 22: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు దేశ చరిత్రలో చీకటి అధ్యాయంగా నిలిచిపోతుందని ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి సుబ్రమణ్యం పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆమ్‌ఆద్మీ పార్టీని రాజకీయంగా ఎదుర్కోలేకనే బీజేపీ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిందని ఆరోపించారు. పదేళ్లలో జాతీయ పార్టీగా అవతరించిన ఆమ్‌ఆద్మీని అణిచివేయడం ప్రధాని తరం కాదని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత రాంభూపాల్ రెడ్డి, సీపీఎం నేత నాగరాజు, సీపీఐ నేత మురళి, ఆమ్‌ఆద్మీ నాయకులు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటాచలపతి, రాష్ట్ర అధికార ప్రతినిధి చందు, సీవైఎస్ రాష్ట్ర కన్వీనర్ జగదీష్, తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేష్ రాయల్ పాల్గొన్నారు.

## సీ-విజిల్‌కు ఫిర్యాదు చేయండి

తిరుపతి, మార్చి22(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై సీ-విజిల్ యాప్‌కు ఫిర్యాదు చేయాలని తిరుపతి నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసే అంశాల్లో డబ్బు, లిక్కర్ పంపిణీ, బెదిరింపులు, ఉచిత బహుమతుల పంపిణీ, ఆయుధాల ప్రదర్శన, ఫేక్ న్యూస్ అంశాలపై ఫొటోలు, వీడియోలు, వాయిస్ మెసేజ్ పంపించడం చేయవచ్చునని పేర్కొన్నారు. కంట్రోల్ రూములోని 0877-2256766 నెంబరుకు కాల్ చేసి ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.

## చెరువులోపడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

నాయుడుపేట, మార్చి 22: నాయుడుపేట పట్టణ పరిధిలోని విన్నమాల చెరువులో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... వాకాడు మండలం తిరుమూరు గ్రామానికి చెందిన జక్కరయ్య(51) కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతుంటేవాడు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చేశాడు. శుక్రవారం ఉదయం విన్నమాల చెరువులో జక్కరయ్య మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ గోపీ సంఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

తడ, మార్చి 22: మండల పరిధిలోని కాదలూరు, కొండూరు, అండగుండాల, వెంజూరుపాడు, మాంబట్టు పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో చంద్రముని శుక్రవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో వసతులపై ఆరా తీశారు. కాదలూరు పోలింగ్ కేంద్రం సమీపంలో చెత్తాచెదారాలు ఉండటంతో పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో వెంట తడ, సూళ్లూరుపేట తహసీల్దార్లు సయ్యద్ ఇక్బాల్, గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

## వైసీపీ నేత మృతి



ప్రభాకర్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

ఓజిలి, మార్చి 22: ఓజిలి మండలం కురుగొండ గ్రామానికి చెందిన వైసీపీ నేత, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ భర్త ముమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి(75) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నెల్లూరులోని అపోలో ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. గతంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడిగా, రైతు సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి, ఆయన సతీమణి, మాజీ మంత్రి రాజ్యలక్ష్మిలకు ప్రధాన అనుచరుడిగా ఉంటూ పార్టీలో కీలకంగా వ్యవహరించారు. అనంతరం వైసీపీలో చేరారు. ప్రభాకరరెడ్డి మృతి పట్ల మండలంలోని టీడీపీ, వైసీపీ, బీజేపీ నాయకులు సంతాపం తెలిపారు.

## వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న జలీల్ అహ్మద్

కోట, మార్చి 22: కోట పట్టణ పరిధిలోని శ్యామసుందరపురానికి చెందిన నిరుపేద ముస్లిం మహిళ షేక్ జరీనా గర్భసంచి వ్యాధితో బాధపడుతోంది. ఆమె వైద్య ఖర్చుల కోసం గ్రీన్ ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ హామీ రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. నిరుపేద ముస్లిం కుటుంబాలను గ్రీన్ ఫౌండేషన్ తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జలీల్ అహ్మద్, నౌషాద్, నాయబ్ రసూల్, బాబు, షంషుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలు, ర్యాలీకి అనుమతులు తప్పనిసరి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 22: సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారం కోసం వినియోగించే వాహనాలు, ర్యాలీలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సూచించారు. విజయవాడ నుంచి ఆయన వర్చువల్ విధానంలో జిల్లా అధికారులతో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ లక్ష్మీశ హాజరయ్యారు. ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వివిధ ఓటరు ఫారాలు, క్లెయిమ్స్, అబ్జెక్షన్స్‌ను నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ర్యాలీలు, ప్రచారం కోసం వాడే వాహనాల కోసం సంబంధిత రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అందిన విజ్ఞప్తి మేరకు అనుమతులు ఇవ్వాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ఉండాలని, శాంతిభద్రతల పర్యవేక్షణ, సీజర్ ఆఫ్ క్యాష్, లిక్కర్, డ్రగ్స్ తదితరాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నూతన ఓటర్ల నమోదుకు ఫారం-6 అందజేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచలకిషోర్, నోడల్ అధికారులు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఎన్నికల డీటీ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

## ఆదిమూలం వద్దు..హెలెన్ ముద్దు

### టీడీపీ నాయకుల డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ కుమార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 22: సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదిమూలం వద్దని, డాక్టర్ హెలెన్‌ను అభ్యర్థిగా ప్రకటించాలని ఆ పార్టీకి చెందిన నాగలాపురం మండల నాయకులు కోరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు మాట్లాడుతూ ఆదిమూలం వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులను అన్ని విధాలుగా వేధించారని ఆరోపించారు. కేసులు పెట్టారని గుర్తు చేశారు. ఇప్పటికీ పలువురు నాయకులు, కార్యకర్తలు పోలీసుస్టేషన్, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నందుకు తమపైనా కేసులు బనాయించారని తెలిపారు. పార్టీ అధిష్ఠానం పునరాలోచించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాగలాపురం మండల క్లస్టర్ ఇన్‌చార్జి ఎండీ కుమార్, కోదండం తిరుపతి, నాగరాజు, మహేష్, బాబు, శివ, దేవ, మునివేలు, అన్నాదొరై, సామ్రాజ్యం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలకు 541 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మార్చి 22: జిల్లాలో శుక్రవారం జరిగిన పదో తరగతి పరీక్షలకు 541 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. గణిత పరీక్షకు 27,182 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 26,641 మంది హాజరయ్యారు. 98 శాతం మంది విద్యార్థులు పరీక్ష రాశారని డీఈవో డాక్టర్ శేఖర్ తెలిపారు. జిల్లాలో ఎక్కడా మాస్ కాపీయింగ్ జరుగలేదని వెల్లడించారు.

# శ్రీకాళహస్తి
## సత్యవేడు

## ఘనంగా అమ్మవారి పవిత్రోత్సవాలు

తొట్టంబేడు, మార్చి 22: మండలంలోని కల్లిపూడి గ్రామంలో వెలసిన చెంచుమహాలక్ష్మి అమ్మవారి పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి శుక్రవారం అభిషేకాలు అలంక రణలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమెల్యే సతీమణి శ్రీవాణిరెడ్డి, ముక్కంటి ఆలయ ఛైర్మన్ అంజూరుశ్రీనివాసులు, నేషనల్ కన్జూమర్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శి కలవగుంట భరత్‌రెడ్డి, ఎంపీపీ నిర్మల దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

## సుధీర్‌రెడ్డికి ఒక్క అవకాశం ఇవ్వండి

తొట్టంబేడు, మార్చి 22: బొజ్జల సుధీర్‌రెడ్డికి ఎమ్మెల్యేగా ఒక అవకాశం ఇవ్వాలని ఆయన సతీమణి రిషితారెడ్డి కోరారు. మండలంలోని గుండేలిగుంట పంచాయతీలో శుక్రవారం ఆమె ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటాచలం, మండల అధ్యక్షుడు మురళినాయుడు, జయచంద్ర నాయుడు, మునిరాజనాయుడు, చంచయ్యనాయుడు, కన్నలి ప్రతాప్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, జనసేన నాయకులు, కొట్టేసాయి, మహేష్, చంద్రశేఖర్‌రెడ్డి, బయ్యారెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగిరెడ్డి, యానాదయ్య, బాలాజీరెడ్డి, కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అడ్రస్ లేని ఆసరా నిధులు

కేవీబీపురం, మార్చి 22: ముఖ్యమంత్రి బటన్ నొక్కి రెండు నెలలైనా ఆసరా నిధులు అడ్రస్ లేవని సీపీఎం నాయకుడు దాసరి జనార్దన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యాదీవెన, చేయూత పథకాలు ఇంతవరకు చేరలేదని తెలియజేశారు. విద్యాదీవెన పడక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే నిధులు విడుదల చేయాలని కోరారు.

## కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది

రేణిగుంట, మార్చి 22: కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు పీసీసీ ప్రధాన కార్యదర్శి గౌడపేర చిట్టిబాబు, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు శివశంకర్ స్వాగతం పలికారు.

## అప్పుల బాధతో పూలవ్యాపారి ఆత్మహత్య

రేణిగుంట, మార్చి 22: రేణిగుంట మండలం జీపాళెం పంచాయతీ పరిధిలోని కుర్రకాలువకు చెందిన ఓ పూల వ్యాపారి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం పద్మావతి నగర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ సునీల్‌కుమార్ కథనం మేరకు.. రేణిగుంటకు చెందిన హేమాద్రి(49) పూలదుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తుండేవాడు. ఆర్థిక సమస్యలతో సతమతమవుతుండేవాడు. ఈ క్రమంలో ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టీడీపీతోనే యువతకు ఉజ్వల భవిత


టీడీపీలో చేరిన యువత

శ్రీకాళహస్తి, మార్చి 22: టీడీపీ ప్రభుత్వంతోనే యువతకు ఉజ్వల భవిత చేకూరుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని 4వ వార్డుకు చెందిన 100 మంది యువకులు టీడీపీలో చేరారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరులోని సుధీర్ రెడ్డి స్వగృహం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం యువత భవితవ్యాన్ని అంధకారం చేసిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే యువత అభ్యున్నతి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటారని భరోసా ఇచ్చారు. ఇక టీడీపీ యువనేత నారా లోకేశ్ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా కృషి చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మిన్నల రవి తదితరులు పాల్గొన్నారు.

## ఏర్పేడులో కేంద్ర బలగాల కవాతు



ఏర్పేడు, మార్చి 22: ఏర్పేడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాపానాయుడుపేట, వికృతమాల, గోవిందవరం, మునగలపాళెం గ్రామాల్లో సీఐ శ్రీరామశ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తమ ఓటును ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలని తెలియజేశారు.

## మద్యం స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

ఏర్పేడు, మార్చి 22: ఏర్పేడు మండలం సీతారాంపేట ఎఫ్‌సీఐ గోదాము వద్ద బీహార్ రాష్ట్రానికి చెందిన హితేష్ కుమార్ పది మద్యం సీసాలు కలిగి ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మద్యం స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేశారు.

**తొట్టంబేడు:** మండలంలోని బోనుపల్లి గ్రామానికి చెందిన పట్టాభి (60) మద్యం తరలి స్తుండగా చిట్టత్తూరు వద్ద అరెస్టు చేశారు. అతడి నుంచి 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాఘవేంద్ర అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## ఆర్థిక లావాదేవీలపై తహసీల్దార్ ఆరా



పిచ్చాటూరు, మార్చి 22: మండలంలోని పలు బ్యాంకుల ద్వారా జరుగుతున్న ఆర్థిక లావాదేవీలపై తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్ శుక్రవారం ఆ బ్యాంకులకు వెళ్లి ఆరా తీశారు. ఎన్నికల కోడ్ నిబంధనల మేరకే నగదును బదిలీ చేయాలని బ్యాంకు అధికారులకు సూచిం చారు. అలాగే గ్రామాల్లో ఉన్న బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించాలని వీఆర్‌వోలను ఆదేశించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


రక్తగాయాలైన ఆటోడ్రైవర్

రేణిగుంట, మార్చి 22: రేణిగుంట పట్టణంలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. శుక్రవారం రేణిగుంట ఫ్లైఓవర్‌పై ఓ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన డం తో ఓ వ్యక్తి కాళ్లకు తీవ్రగాయాల య్యా యి. అలాగే రాత్రి మాతమ్మ ఆలయం వద్ద ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌కు గాయాల య్యాయి. వీరిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు.

## బీజేపీని ఆదరించండి


ప్రచారం నిర్వహిస్తున్న సుబ్రమణ్యంరెడ్డి తదితరులు

తొట్టంబేడు, మార్చి 22: వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ కో-కన్వీనర్ మేళాగరం సుబ్రమణ్యంరెడ్డి కోరారు. మండలంలోని కొమ్మనిగుంట, గురుకులపాళెం గ్రామాలలో శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. కోలా ఆనంద్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి గోపాల్, మండల అధ్యక్షుడు కృష్ణయ్య, సుబ్బరామిరెడ్డి, భరత్‌నాయుడు, అయ్యప్ప, రవిఆచారి, గీత, రవిచంద్ర, దొరబాబు. హరీష్, నాయకులు పాల్గొన్నారు.

## కుక్కంబాకంలో కోడ్ ఉల్లంఘన


అంగనవాడీ కేంద్రం గోడపై ఉన్న జగన్ ఫోటో

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 22: మండలంలోని కుక్కంబాకం గ్రామంలోని అంగన్‌వాడీ భవనం గోడకు ముఖ్యమంత్రి జగన్ ఫొటో దర్శనమిస్తోంది. ఎన్నికల నియమావళి ప్రకారం రాజకీయ నాయకుల చిత్రాలను తొలగించాల్సి ఉంది. సచివాలయ సిబ్బంది దీన్ని పట్టించుకోవడం లేదు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుగుదేశం నాయకులు తెలిపారు.

## కనకదుర్గమ్మకు విశేష పూజలు



శ్రీకాళహస్తి, మార్చి 22: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాలం సమయంలో అమ్మవారి మూలమూర్తికి వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. మహిళలు పెద్దసంఖ్యలో అమ్మ వారికి దీపారాధన సమర్పించారు. సామూహిక లలితా సహస్ర నామం పఠించారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## సంపంగిలో సమగ్ర సస్యరక్షణ ముఖ్యం


సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

రేణిగుంట, మార్చి 22: సంపంగి సాగులో సమగ్ర సస్య రక్షణ ముఖ్యమని శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలియజేశారు. రాస్ కృషి విజ్ఞానకేంద్రంలో శుక్రవారం రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంపంగిలో నులిపురుగులు ఆశించడం వలన 70-80శాతం పంట నష్టం జరుగుతుందని తెలిపారు. నులిపురుగుల నివారణకు పంట వేయడానికి ముందుగా పెసిలో మైసిస్ మందుతో విత్తన శుద్ధిచేయాలని ఎకరాకు రెండు కిలోల చొప్పున ట్రైకోడెర్మా, సూడో మోనస్, పెసి మైసీన్లను 100 కిలోల వేపపిండిలో కలిపి వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సుధాకర్, రామ్‌కుమార్, రాము పాల్గొన్నారు.

## నీటి వృథాతో భావితరాలకు నష్టం


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

వరదయ్యపాళెం, మార్చి 22: నీటిని వృథా చేయడం భావితరాలకు నష్టమని అపోలో పరిశ్రమ సీఎస్ఆర్ కో-ఆర్డినేటర్ లీఫిన్ అన్నారు. మండలంలోని రాచర్ల పంచాయతీలో శుక్రవారం అపోలో పరిశ్రమ వారి సహకారంతో రియల్ చారిటబుల్ ట్రస్టు వారు ఘనంగా ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. 70మంది విద్యార్థులకు ప్రపంచ జలదినోత్సవ లోగోతో ఉన్న టీషర్టులను అందజేశారు. అనంతరం మొక్కలు నాటారు. రియల్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు లారెన్స్, లక్ష్మి, హెచ్‌ఎం, టీచర్లు పాల్గొన్నారు.

## రాష్ట్రం డ్రగ్స్ మయం : టీడీపీ


మాట్లాడుతున్న ఉమేష్ రావు

శ్రీకాళహస్తి, మార్చి 22: సీఎం జగన్ రాష్ట్రాన్ని డ్రగ్స్ మయం చేశారని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్‌రావు విమర్శించారు విశాఖలో భారీ ఎత్తున డ్రగ్స్ పట్టుబడడంపై శుక్రవారం శ్రీకాళహస్తిలో టీడీపీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. విశాఖలో 25 వేల కిలోల డ్రగ్స్ వెలుగు చూడటం రాష్ట్రానికే సిగ్గుచేటు అన్నారు. ఎన్నికల వేళ ఇంత భారీఎత్తున మత్తు పదార్థాలు ఎందుకు దిగుమతి అవుతున్నాయో ప్రభుత్వం వెల్లడిం చాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు బుజ్జి, జిలాని పాల్గొన్నారు.

## నకిలీ పట్టాలతో ఎమ్మెల్యే ప్రలోభాలు: సుధీర్



తొట్టంబేడు, మార్చి 22: ఎమెల్యే బియ్యపు మధు రాజీవ్‌నగర్‌లో నకిలీ పట్టాలు తయారు చేసి నాయకులను ప్రలోభాలకు గురిచేస్తున్నారని టీడీపీ ఎమెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి ఆరోపించారు. ఊరందూరులోని తన ఇంట్లో శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడారు. ఐదు సంవత్సరాలుగా నాయకులను పట్టించుకోకుండా ఎన్నికల వేల రాజీవ్‌నగర్ కాలనీలో పూర్వపు తహసీల్దార్ల పేర్లతో నకిలీ స్టాంపులు తయారు చేయించి, ఫోర్జరీ సంతకాలతో పట్టాలను తయారుచేసి 1650 పట్టాలను పంచుతున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. నకిలీ పట్టా తీసుకుని నాయకులు మోసపోవద్దన్నారు. టీడీపీ అధికారం లోకి వచ్చిన వెంటనే నకిలీ పట్టాలను రద్దు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలను పంపిణీ చేస్తామన్నారు. శ్రీకాళహస్తి రిటర్నింగ్ అధికారి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆయనపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిస్తున్న పోలీసు అధికారులపై ఇప్పటికే ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వలంటీర్లు, ప్రభుత్వ అధికారులెవరైనా ఏకపక్షంగా వ్యవహరిస్తే ఎన్నికల కమిషన్‌ను ఫిర్యాదు చేస్తామని తెలియజేశారు. అధికారులు వారి విధులను సక్రమంగా నిర్వహించాని ఆయన కోరారు.

## అనుమతులు లేని క్వారీలను నిలిపేయాలి


ధర్నా చేస్తున్న గ్రామస్తులు, వామపక్షాల నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 22: అనుమతులు లేకుండా చలంవారి కాలనీ వద్ద నడుపుతున్న క్వారీ, క్రషర్‌లను మూసేయాలని సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం క్వారీల వద్ద చేపట్టిన బ్లాస్టింగ్‌తో ఇళ్లపై పెద్ద రాళ్లు పడ్డాయి. ఆందోళనకు గురైన గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ధనంజయ మాట్లాడుతూ గ్రామ సర్వే నెంబర్లు 314, 315, 316, 317, 330గల భూమిలో అక్రమంగా క్వారీలు, క్రషర్‌లు నిర్వహిస్తున్నారని తెలియజేశారు. అక్రమ క్వారీలను రద్దు చేయాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల సీనియర్ నాయకులు నలుగూరి రమణయ్య, సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కూలీ ఆత్మహత్య


సురేష్

తొట్టంబేడు, మార్చి 22: క్షణికావేశంతో ఓ వ్యవసాయ కూలీ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శ్రీకాళ హస్తి మండలంలోని వేడాం గ్రామంలో చోటు చేసుకొంది. స్థానికుల కథనం మేరకు.. రొడ్డా సుబ్రమణ్యం కుమారుడు సురేష్ (35) వ్యవసాయ కూలీ. కుటుంబంలో చిన్నపాటి మనస్పర్థలు చోటుచేసుకోవడంతో శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

## నారా లోకేశ్‌ని కలిసిన దశరథవాసు



సత్యవేడు, మార్చి 22: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథవాసు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విషయంలో అధిష్టానం పునఃపరిశీలన చేస్తే తన అభ్యర్థిత్వాన్ని పరిగణనలోకి తీసుకోవాలని విన్నవించారు.

## వైభవంగా ప్రదోష పూజలు

నాగలాపురం, మార్చి 22: సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో శుక్రవారం ప్రదోష పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయంలోని పరివార దేవతలకు ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్ అభిషేకాలు చేసి విశేష పూజలు జరిపారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు చేసి దీప ధూప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం వివిధ పుష్పాలతో పుష్పాలంకరణ చేసి నక్షత్ర హారతి, కుంభ హారతి, మహా హారతి చేపట్టారు. భక్తుల శివనామస్మరణలతో ఆలయం మార్మోగింది. ఉత్సవ మూర్తులైన వాల్మీకేశ్వర స్వామి, మరగదాంబికా అమ్మవార్లను సుందరంగా ముస్తాబు చేసి ఆలయ ఆవరణలో ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ పూజలను ఆలయ ఈవో రామచంద్రారెడ్డి నేతృత్వంలో సిబ్బంది పర్యవేక్షించారు.

## దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, మార్చి 22: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఉదయం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. నిమ్మకాయలు, పూలమాలతో సుంద రంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. శ్రీకాళహస్తితో పాటు పలు గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించు కున్నారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం దాతలు భక్తులకు అన్నదానం చేశారు.

## బంగారు చైను అపహరణ

శ్రీకాళహస్తి, మార్చి 22: మహిళ మెడలోని బంగారు గొలుసును ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు అపహరించారు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణ శివారులోని కాసా గార్డెన్ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. తొట్టంబేడు మండలం జ్ఞానమ్మ కండ్రిగ గ్రామానికి చెందిన వెంకటగౌరి సొంత పని నిమిత్తం శ్రీకాళహస్తికి వచ్చింది. అనంతరం కాలినడకన తిరిగి ఇంటికి బయలుదేరింది. కాసా గార్డెన్ సమీపంలోని ఇటుకుల బట్టీ వద్ద రోడ్డుపై నడిచి వెళుతుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దొంగలు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారు. బాధితురాలు శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులను ఆశ్రయించింది. గొలుసు 20 గ్రాములు ఉందని తెలియజేసింది.

## 'ఆదిమూలం వద్దేవద్దు'

వరదయ్యపాళెం/నాగలాపురం/సత్యవేడు, మార్చి 22: సత్యవేడు ఎమ్మెల్యేగా ఆదిమూలం వద్దేవద్దు అని వరదయ్యపాళెం మండల టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. వరదయ్యపాళెంలోని కల్కి కోచింగ్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చలపతినాయుడు, మధునాయుడు, హరినాయుడు, దశరథన్, సునీల్, రాజారాం, కుమార్, శివ, అజయ్, పృథ్వీ, నాగరాజు, గోవిందయ్య పాల్గొన్నారు. ● ఆదిమాలానికి టికెట్ కేటాయింపుపై అధిష్టానం పునరాలోచించాలని నాగలాపురం టీడీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. నాగలాపురంలో ఐ-టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. పార్టీకోసం కష్టపడిన వారికి టికెట్ ఇవ్వాలని కోరారు. ● ఆదిమూలానికి టికెట్ ఇచ్చి సత్యవేడు టీడీపీ కంచుకోటను కూల్చవద్దని ఆ పార్టీ సత్యవేడు నాయకులు, కార్యకర్తలు అధిష్టానానికి విన్నవించారు. సత్యవేడు మండలం మదనంబేడు గ్రామంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదిమూలం అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలియజేశారు. తమను కేసులతో వేధించిన వ్యక్తికి టికెట్ ఇస్తే సహకరించేది లేదని స్పష్టం చేశారు. హెలెన్‌కే టికెట్ ఇవ్వాలని విన్నవించారు.

## ఎవరా వ్యక్తి?

**- ముక్కంటి సాంస్కృతిక కార్యక్రమాల అవినీతిపై దేవాదాయశాఖ ఆరా**

తిరుపతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాళహస్తీశ్వరస్వామి శివరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో దేవాదాయ శాఖ అధికారులు ఆరా తీశారు. ముక్కంటి సాంస్కృతిక శాఖ ఉత్సవాల్లో కళాకారుల ఇబ్బందులు, ఆకట్టుకోలేని కార్యక్రమాల నిర్వహణ, అవినీతి ఆరోపణలపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాల నేపథ్యంలో జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ (ఏసీ) రామకృష్ణారెడ్డి స్పందించారు. ఆలయ ఉద్యోగికాని విశ్రాంత ఉపాధ్యాయుడు స్వర్ణమూర్తికి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ అప్పగించినట్లు గుర్తించారు. దీని వెనుక ఉన్న రాజకీయ ఒత్తిడులపై ఆరా తీశారు. పలువురు కళాకారులతో కూడా మాట్లాడినట్లు తెలిసింది. భవిష్యత్తులో అలాంటి వ్యక్తులను దూరం పెట్టాలని ముక్కంటి ఆలయ అధికారులకు ఏసీ సూచనలు చేసినట్లు సమాచారం. దీనిపై ముక్కంటి ఆలయ ఈవో నాగేశ్వరరావు కూడా ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

## గెలుపు బాధ్యత మీదే

**● వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు మంత్రి పెద్దిరెడ్డి సూచన**


సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

నాగలాపురం/వరదయ్యపాళెం/కేవీబీపురం/బుచ్చినాయుడుకండ్రిగ/పిచ్చాటూరు/నారాయణవనం/సత్యవేడు, మార్చి 22: మళ్లీ వైసీపీని అధికారంలోకి తీసుకువచ్చే బాధ్యత నాయకులు, కార్యకర్తలదేనని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఆయన మండల కేంద్రాల్లో ఎన్నికల శంఖారావం పేరిట సభలు నిర్వహించారు.సత్యవేడు ఎమ్మెల్యేగా నూకతోటి రాజేష్‌ను, ఎంపీగా గురుమూర్తిని గెలిపించాలని కోరారు. విభేదాలుంటే పక్కనపెట్టి సమష్టిగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. వైసీపీ సమావేశానికి రాకపోతే సంక్షేమ పథకాలు కట్ చేస్తామని నాగలాపురం మండలంలోని సర్పంచ్‌లు ఆయా గ్రామాల్లోని ఎస్టీలను పెద్దఎత్తున సమావేశానికి తరలించినట్లు సమాచారం.

**పెద్దిరెడ్డి సభలకు వెలుగు సహకారం**

మంత్రి పెద్దిరెడ్డి సభలకు పెద్దఎత్తున మహిళలను తరలించేందుకు వెలుగు అధికారులు, సిబ్బంది పరోక్షంగా బాధ్యతలు తీసుకున్నారన్న ఆరోపణలొచ్చాయి. ఏడు మండలాల్లో డ్వాక్రా సంఘాల్లోని మహిళలు తరలివచ్చేలా సంఘమిత్రలకు సంబంధిత అధికారులు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అధికారులు సంఘమిత్రలతో రెండు రోజుల క్రితం సమావేశం జరిపినట్లు సమాచారం. ఇదిలా ఉండగా సభకు జనాలను తరలించేందుకు నాయకులు పడరాని పాట్లు పడ్డారు. పార్టీ నాయకత్వం వచ్చిన వారికి రూ.100 మాత్రమే ఇవ్వడంతో మిగిలిన డబ్బులను గ్రామస్థాయి నాయకులు పంచినట్లు సమాచారం.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించండి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 22: జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను రెండు రోజులకొకసారి సందర్శించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం జిల్లాలోని ఎన్నికల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఎన్నికల శిక్షణకు హాజరు కాని పీవో, ఏపీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. సి-విజిల్ యాప్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. నియోజకవర్గాల్లోనూ సి-విజిల్ మానటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. నాయకులకు సువిధ యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల కోడ్‌కు ముందు మంజూరై ప్రారంభమైన పనుల వివరాలను అప్పగించాలని ఆదేశించారు. ఈఆర్వోలు జేసీ ధ్యానచంద్ర, అదితిసింగ్, డీఆర్వో పెంచలకిషోర్, నిశాంత్ రెడ్డి, కిరణ్‌కుమార్, చంద్రముని, రామమోహన్ పాల్గొన్నారు.

## ముగిసిన ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్


హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

ఏర్పేడు, మార్చి 22: ఏర్పేడు మండలంలోని ఐఐఎస్ఈఆర్ విద్యార్థులు చేపట్టిన ఏక్ భారత్... శ్రేష్ఠ భారత్ కార్యక్రమం శుక్రవారం త్రిపురలో ముగిసింది. త్రిపురకు చెందిన 50మంది విద్యార్థుల బృందం ఐదు రోజులపాటు ఏపీలో పర్యటిస్తూ ఏర్పేడు ఐసర్‌కు వచ్చారు. ఇక్కడి విద్యార్థులతో కలిసి పర్యాటకం, సంప్రదాయాలు, అభివృద్ధి, టెక్నాలజీ, ప్రజల- ప్రజల మధ్య అనుసంధానం అనే అంశాలపై చర్చించారు. అనంతరం శ్రీహరికోటలోని షార్, గాదంకి వద్ద గల భారత వాతావరణ కేంద్రం, శ్రీసిటీ పారి శ్రామికవాడ, గుడిమల్లం, తిరుమల, ఐఐటీ, ఎస్‌వోఎస్, కలంకారీ కేంద్రాలను సందర్శించారు. తిరుపతి ఐసర్ విద్యార్థులను త్రిపురకు తీసుకెళ్లారు. విద్యార్థులు బంగ్లాదేశ్ సరిహద్దు, ఉజ్జయంత ప్యాలెస్ సందర్శించారు. ఇంతటిలో వీరి పర్యటన ముగిసింది.